జాతీయ దినపత్రిక
Postail Licence No. L/KNL/3-52(D) 2018 - 2020

ఉదయం న్యూస్

ఎడిటర్ : సి. శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక :234 పేజీలు 8 వెల : 5 బుధవారం 03 జూన్ 2026

కూటమి నేతలతో సమన్వయం చేసుకుని సాగాలి

మన ఓట్లు తీసేందుకు గొడ్డలి పార్టీ కుట్ర చేసే యత్నం

ప్రతి ఒక్కరూ సైకిల్ వాడాలి..నేరుగా ప్రజలను కలవాలి

పని చేయని వారిని నిర్మొహమాటంగా పక్కన పెట్టేస్తా

ఎస్ఐఆర్‌పై వర్క్ షాప్‌లో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

పుష్కరాలకు పకడ్బందీగా ఏర్పాట్లుభక్తులకు లోటు రాకుండా చర్యలు చేపట్టాలి

పుష్కరాల ఏర్పాట్లపై చంద్రబాబు సమీక్ష

2లో..

సర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన

పంటల వైవిధ్యంపై గ్రామసభల్లో రైతులకు సూచన

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

2లో..

భారత్‌లో ఎబోలా టెన్షన్..

ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి

అప్రమత్తమైన భారత ప్రభుత్వం

2లో..

కవిత పార్సిల్ రాజకీయం

మీకు ముఖ్యమంత్రి పదవి ఎందుకు కవిత?

విగ్రహాలు కూల్చడానికి కుర్చీ కావాలా?

ప్రాంతాల మధ్య విద్వేషాలు రగల్చడానికా?

కవితకు బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్

2లో..

జనసేన పుట్టిందే తెలంగాణలో

అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది

ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చుకున్నా

తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం

తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు

తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే

తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం ఎవరి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు మీడియా సమావేశంలో జనసేనాని పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ

2లో..

బెంగాల్‌లో ట్రీట్మెంట్ అందడం లేదు

అభిషేక్ బెనర్జీని హైదరాబాద్‌కు తరలిస్తాం

మాజీ సీఎం మమతా బెనర్జీ వెల్లడి

"వారు నన్ను చంపాలనుకున్నారు. మొత్తం ఘటన కెమెరాలో రికార్డయింది. ఈ విషయాన్ని బెంగాల్ హైకోర్టు, గవర్నర్‌కు తెలియజేస్తాం. కోర్టుకు ఆశ్రయించి న్యాయం కోరతాం. అవసరమైతే సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తాను" అని అన్నారు.

తెలంగాణ కోటి రత్నాలవీణ

త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల

టీజీపీఎస్సీ ద్వారా విడుదల చేస్తాం

జాబ్ నోటిఫికేషన్ల జారీ నిరంతర ప్రక్రియ

న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ

67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం

నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం

అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..

2లో..

కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం రుణమాఫీతో రైతులను రుణ విముక్తి చేశాం తొలి ఏడాదిలోనే రూ.22 వేల కోట్లు జమ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం చిత్తశుద్ధి కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తాం మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతాం మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు రాష్ట్ర మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి వెల్లడి ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ విషెస్ ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహణ అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన సీఎం

2లో..

- అకాల వర్షాలతో రైతులు కన్నీరు
- తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం
- ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు

మరోసారి తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

పశ్చిమ ఆసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

కొలిక్కిరాని దౌత్యపరమైన ప్రయత్నాలు

చర్చలు నిలిపేస్తున్నామని ఇరాన్ ప్రకటన

'హార్ముజ్' జలసంధిని పూర్తిగా మూసివేత!!



2లో..

ఉదయం న్యూస్

భారత్‌లో ఎబోలా టెన్షన్..

న్యూఢిల్లీ: కాంగో, ఉగాండా తదితర ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాధి వేగంగా విస్తరిస్తున్న తరుణంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలాలోని అత్యంత ప్రమాదకరమైన 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ వేగంగా వ్యాపిస్తుండటంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజా గైడ్‌లైన్స్ జారీ చేసింది. ముఖ్యంగా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని భారతీయులను కోరినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక ప్రకటన ద్వారా చెప్పింది. తాజా పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. మే 17, 2026న ఈ ఎబోలా వ్యాప్తిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్ గా ప్రకటించింది. అలాగే ఆఫ్రికా సీడీసీ సైతం దీనిని ఖండాంతర భద్రతా ముప్పుగా పరిగణించిందని 'ద హిందూ' పత్రిక తన నివేదికలో తెలిపింది. ఈ ప్రమాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మే చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, విమానాశ్రయాల్లో పటిష్టమైన స్క్రీనింగ్, నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఇప్పటివరకు ఎబోలా (బుండిబుగ్యో స్ట్రెయిన్) కేసులు ఏవీ నమోదు కాలేదనీ, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ముందస్తు జాగ్రత్తగా అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ తప్పనిసరి చేశారు.గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి నేరుగా వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించి వచ్చిన వారు కచ్చితంగా స్వీయ నిర్బంధంలో ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ గట్టిగా సూచించింది. ఒకవేళ ఆ ప్రయాణికులలో అకస్మాత్తుగా జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, విరేచనాలు, లేదా శరీరంలో ఎక్కడినుంచైనా అకారణంగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే స్థానిక ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలి. సాయం కోసం వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ '1075' కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేసింది. సకాలంలో వైద్య సహాయం పొందడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, ఇతరులకు వ్యాధి సోకకుండా నిరోధించవచ్చని ది హిందూ రిపోర్ట్ చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పంపింది. ఆసుపత్రులలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, పరీక్షల కోసం ల్యాబొరేటరీలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. విమానాశ్రయంలో ఎవరైనా అనుమానిత రోగులు గుర్తిస్తే వెంటనే వారిని ప్రత్యేక అంబులెన్సుల ద్వారా ఐసోలేషన్ సెంటర్లకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

తెలంగాణ కోటి రత్నాలవీణ

హైదరాబాద్: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిషికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళ్తున్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు.

కూటమి నేతలతో సమన్వయం చేసుకుని సాగాలి

అమరావతి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెదేపా ఎమ్మెల్యేలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జనసేన, భాజపాతో కలిసి సమన్వయం చేసుకొని 'సర్'ని పర్యవేక్షించాలన్నారు. తెదేపా ప్రధాన పార్టీగా ఉన్నందున పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 'సర్'పై తెదేపా ఎమ్మెల్యేలకు చంద్రబాబు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై వర్క్ షాప్‌లో ఏపీ సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. శిక్షణ తరగతులకు హాజరుకాని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2002 తర్వాత ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. మన ఓట్లు తీసేసి.. వాళ్ల ఓట్లు పెట్టేలా కుట్రలకు గొడ్డలి పార్టీ వెనుకాడదు. 'సర్' సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మాకేం సంబంధం లేదన్నట్లుగా ఎంపీలు ఉంటే సరికాదు. జులై 14 లోపు ఓట్లు ఉండేలా చూసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. పార్టీ ఉంటేనే ప్రభుత్వం వస్తుందనే బాధ్యతతో ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సైకిల్ పవర్ చూపించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిల్ వాడండి. దీని వల్ల ఖర్చు సున్నా.. ఆరోగ్యానికి ఆరోగ్యం. ఎలక్ట్రిక్ సైకిల్‌పై వీలైనన్ని ఎక్కువ ఇళ్లకు తిరుగుదాం. ఈ నెల 4న ఎన్డీయే సమావేశం తర్వాత భవిష్యత్ కార్యాచరణ చేపడతాం. 2024లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో పెరగాలి. ప్రతి బుధవారం పార్టీ క్యాలెండర్ తప్పనిసరిగా అమలు కావాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఎన్డీఏ సమన్వయ కమిటీల నియామకం జరగనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో మిత్రపక్షాలను కలుపుకువెళ్లాలని.. బలం ఎక్కువా తక్కువా అనేది అనవసరమని, అటువంటి ఆలోచనలు కూడా పెట్టుకోవద్దన్నారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేలకు సీఎం స్పష్టం చేశారు. ఈ నెల 4న ఎన్డీఏ నేతల సమావేశం జరగనుందని తెలిపారు. జెండా మోయాలంటే జెండా ద్వారా వచ్చిన అధికారంలో కార్యకర్తలను భాగస్వామ్యులను చేయాల్సిందే అని చెప్పారు. పదవి ఎవరికీ శాశ్వతం కాదని.. పనిచేసినంత కాలం పదవికి ఢోకా ఉండదని సీఎం అన్నారు. పని చేయకపోతే నమస్కారం పెట్టి ఎటువంటి మొహమాటం లేకుండా పక్కనపెట్టేస్తానని తేల్చిచెప్పేశారు. ఎవరూ వన్ టైం ఎమ్మెల్యేగా మిగిలిపోవద్దన్నారు. అమెరికన్ డెమోక్రసీలో రెండు సార్లు మాత్రమే ఎన్నికయ్యేందుకు అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. 'మన దగ్గర ప్రజలు మెచ్చినంత కాలం మనం ఎమ్మెల్యేగా ఉండవచ్చు. ఎమ్మెల్యేల ప్రవర్తన బాగుంటే.. ఓట్లు పడతాయి.. ప్రజలు ఆదరిస్తారు. ఎమ్మెల్యేల ప్రవర్తన బాగోలేకపోతే ఓట్లు పోతాయి.. ఆ విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలి. పనిచేయకపోయినా పర్వాలేదు.. నోరు మాత్రం పారేసుకోవద్దు. తస్మాత్... జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యేలను చంద్రబాబు హెచ్చరించారు.

సర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన

హైదరాబాద్: ఓటరు జాబితా పక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. 'సర్' పక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 4, 6, 9, 10 తేదీల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వివరించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్లలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పంటల వైవిధ్యతపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణంపైనా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసభల్లో పంటల వైవిధ్యీకరణపై రైతులకు సూచనలు చేయాలన్నారు. వర్షాకాల సన్నద్ధతపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నీటి నిల్వల నివారణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ తెలిపారు. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ సభ్యుల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్లకు సీఎస్ రామకృష్ణారావు సూచనలు చేశారు.

బెంగాల్‌లో ట్రీట్మెంట్ అందడం లేదు

అభిషేక్ బెనర్జీని హైదరాబాద్‌కు తరలిస్తాం

మాజీ సీఎం మమతా బెనర్జీ వెల్లడి

సోనార్‌పూర్: పశ్చిమ బెంగాల్ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీపై దక్షిణ 24 పరగణా జిల్లాలోని సోనార్‌పూర్‌లో శనివారం జరిగిన దాడి రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటన తర్వాత తృణమూల్ కాంగ్రెస్, బీజేపీల మధ్య పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పలు ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం అభిషేక్ బెనర్జీపై దాడిని తీవ్రంగా ఖండించారు. మమతా బెనర్జీ మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీ ఎన్నికల అనంతరం జరిగిన హింసతో ప్రభావితమైన కుటుంబాలను పరామర్శించడానికి సోనార్‌పూర్‌లో వెళ్లారు. ఈ సమయంలో ఆయన కాన్వాయ్‌పై, ఇటుకలు, రాళ్లు, గుడ్లు విసిరారని ఆరోపణలు వచ్చాయి. ఈ దాడిని బీజేపీ కార్యకర్తలు చేశారని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, అభిషేక్ బెనర్జీతో పాటు మాజీ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. దాడి తర్వాత అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ తనపై హత్యాయత్నం జరిగిందని చెప్పారు. "వారు నన్ను చంపాలనుకున్నారు. మొత్తం ఘటన కెమెరాలో రికార్డయింది. ఈ విషయాన్ని బెంగాల్ హైకోర్టు, గవర్నర్‌కు తెలియజేస్తాం. కోర్టుకు ఆశ్రయించి న్యాయం కోరతాం. అవసరమైతే సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తాను" అని అన్నారు. ఈ దాడిని బీజేపీ చేయించిందని, భద్రతా వ్యవస్థలో కావాలనే లోపం చేశారని ఆరోపించారు. ఇదే బీజేపీ చెప్పే ప్రజాస్వామ్యం. ఎన్నికల ఫలితాలు వచ్చి నెల కూడా కాలేదు, పోలీసులు ఎక్కడా కనిపించడం లేదని అభిషేక్ అన్నారు. అభిషేక్ బెనర్జీ తనతో ఉన్న భద్రతా సిబ్బంది దాడి గురించి పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారని, అయినప్పటికీ కావాల్సినంత పోలీసు బలగాలు సంఘటనా స్థలానికి చేరుకోలేదని ఆరోపించారు. భద్రతా అధికారులు నిరంతరం సమాచారం ఇస్తున్నా పోలీసులు రాకపోతే, ఈ ఘటన జరగాలని ఉన్నతాధికారులు కోరుకున్నారని తేలిపోయిందన్నారు. మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి, మేము కోర్టును ఆశ్రయిస్తాం అన్నారు. అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. టీఎంసీ ఎంపీపై దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదని, ఇది ప్రజాస్వామ్యం,

ప్రజల తీర్పుపై దాడిగా పేర్కొన్నారు. ఇది బీజేపీ ప్రతీకార రాజకీయాలకు ఉదాహరణ అని అన్నారు.మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. బెంగాల్‌లో పాలకులు హంతకులుగా మారారు, ఇలాంటి పనులు చేయడానికి బీజేపీ సిగ్గుపడాలన్నారు.

పుష్కరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

అమరావతి: పుష్కరాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని సిఎం చంద్రబాబు అన్నారు. భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. వెలగపూడి సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘంతో కీలక సమావేశం నిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. పుష్కరాల కోసం మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. నీటి వనరులు, రోడ్లు, ఆరోగ్య శాఖల సమన్వయంపై సమావేశంలో చర్చించారు. పుష్కర ఘాట్ల అభివృద్ధిపై అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. పుష్కరాల నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి ఎండోమెంట్స్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి , నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవగా.. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వర్చువల్‌గా హాజరయ్యారు. అలాగే సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, గోదావరి పుష్కరాల నోడల్ అధికారి వీరపాండియన్ సమీక్షకు హాజరయ్యారు.

మరోసారి తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

న్యూఢిల్లీ:పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్)లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన సైనిక చర్యలను మరింత విస్తృతం చేయడాన్ని నిరసిస్తూ.. అమెరికాతో మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న దౌత్యపరమైన చర్చలను ఇరాన్ సోమవారం రద్దు చేసుకుంది. ఈ మేరకు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'తస్నిమ్' ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమ ఆసియాలో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు పూర్తిగా స్తంభించిపోవడంతో ఇరాన్ చర్చల బృందం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సదరు వార్తా సంస్థ పేర్కొంది. ఈ చర్చల నిలిపివేతపై ఇరాన్ ప్రతినిధులు స్పందిస్తూ.. "లెబనాన్‌లో ఇజ్రాయెల్ నిరంతరం సాగిస్తున్న అకృత్యాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. కాల్పుల విరమణ ఒప్పందానికి లెబనాన్ అంశం ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ ఇప్పుడు లెబనాన్‌తో సహా అన్ని రంగాలలోనూ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. అందుకే మధ్యవర్తుల ద్వారా అమెరికాతో జరుపుతున్న చర్చలను, పత్రాల మార్పిడిని ఇరాన్ బృందం తాత్కాలికంగా నిలిపివేస్తోంది" అని తస్నిమ్ నివేదించింది.ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయెల్ దళాలు పూర్తిగా వెనక్కి వెళ్లాలని, అలాగే గాజా, లెబనాన్‌లలో సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయాలనే తమ డిమాండ్లు నెరవేరే వరకు అమెరికాతో దౌత్యపరమైన చర్చలను తిరిగి ప్రారంభించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి కొద్దిసేపటి ముందే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ సోషల్ మీడియా వేదికగా అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు పెంచడం అంటే.. అమెరికాతో కుదిరిన విస్తృత కాల్పుల విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. "ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనేది నిస్సందేహంగా లెబనాన్‌తో సహా అన్ని రంగాలకు వర్తిస్తుంది. ఏదైనా ఒక రంగంలో దీనిని ఉల్లంఘిస్తే, అది అన్ని వైపులా ఉల్లంఘించినట్లే అవుతుంది. దీనివల్ల వచ్చే పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది." అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ పేర్కొన్నారు. అమెరికాతో దౌత్య సంబంధాలు తెంచుకోవడంతో పాటు, ఇరాన్ తన కూటమి దేశాలతో కలిసి అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్'ను పూర్తిగా స్తంభించిపోయేలా చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు ప్రకటించింది.దీనితో పాటు ఎర్రసముద్రంలోని 'బాబ్ ఎల్ మండేబ్'జలసంధి లోనూ ఇతర వ్యూహాత్మక పంథాలను అస్త్రాలుగా మార్చి, ఇజ్రాయెల్ మరియు దానికి మద్దతు ఇస్తున్న దేశాలను ఆర్థికంగా, సైనికంగా 'శిక్షించాలని' ఇరాన్ కూటమి నిర్ణయించింది. గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయెల్ క్రూరమైన ఆర్మీ ఆపరేషన్లను తక్షణమే ఆపాలని, లేదంటే ఈ ప్రతిఘటన మరింత తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పట్టుబడుతోంది.

జనసేన పుట్టిందే తెలంగాణలో

హైదరాబాద్: తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు.తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరపున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007-08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు.

కవిత పార్సిల్ రాజకీయం

అమరావతి: కవిత చేసిన ఈ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విగ్రహాలు కూల్చడానికి, ప్రాంతాల మధ్య విద్వేషాలు రగల్చడానికి మీకు ముఖ్యమంత్రి పదవి కావాలా కవిత గారు? అంటూ ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కావాలంటే మీకు 'జింఖానా గ్రౌండ్' అంత విశాలమైన హృదయం ఉండాలి; అంతే తప్ప చంచల్‌గూడ జైలు అంత చిన్న మనసు ఉండకూడదు అంటూ గతంలో ఆమె జైలుకు వెళ్లిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ పరోక్షంగా సంచలన సెటైర్లు వేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండాలనుకునే వారు సమాజాన్ని జోడించేలా మాట్లాడాలి కానీ, ఇలా విగ్రహాలు పగులగొడతామంటూ విద్వేషాలు రెచ్చగొట్టడం తగదని హితవు పలికారు. ఇదే తరుణంలో హైదరాబాద్‌లో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ కు పోలీసులు అనుమతి నిరాకరించడంపై కూడా విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయనే సాకుతో సభను అడ్డుకోవడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. ఒక పక్క విపక్షాలు సెంటిమెంట్‌ను వాడుకుంటుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేళ పాత గాయాలను రేపుతూ, విగ్రహాల కూల్చివేత రాజకీయాలకు పిలుపునివ్వడం ద్వారా కవిత సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాలని చూశారు. కానీ, దానికి విష్ణువర్ధన్ రెడ్డి ఇచ్చిన చంచల్‌గూడ కౌంటర్ సోషల్ మీడియాలో మరింత చర్చకు కారణం అవుతోంది. అంతకుముందు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ విభేదాల మంటలు రాజుకుంటున్నాయి. ఇటీవల కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ నేతలను ఉద్దేశించి ఆమె చేసిన తీవ్ర వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య పొలిటికల్ హీట్‌ను పెంచాయి. దీనిపై భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి గట్టిగా కౌంటర్ ఇవ్వడంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ నేతలను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. మేము అధికారంలోకి రాగానే ఇక్కడున్న ఆంధ్రా నాయకుల విగ్రహాలను పగలగొట్టి, వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడకు పార్సిల్ చేస్తాం అంటూ ఆమె తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

అకాల వర్షాలతో రైతులు కన్నీరు

హైదరాబాద్: ఆరుగాలం కష్టపడి పండించిన పసిడిపంట చేతికొచ్చే సమయానికి అన్నదాతను ప్రకృతి పగబట్టి ఆడుకుంటోంది. ఉదయం పూట భగభగ మండుతున్న ఎండలు కమ్మేస్తుంటే.. రాత్రి కాగానే విరుచుకుపడుతున్న కారుమబ్బులు, భయపెడుతున్న ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాతావరణం పూర్తిగా అతలాకుతలమైంది. పగలు దంచికొడుతున్న ఎండల తీరు ఒకలా ఉంటే రాత్రివేళ ముంచుకొస్తున్న అకాల వర్షాలు రైతన్నల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రకృతి కన్నెర్ర చేయడంతో స్వేదం చిందించి పండించిన ధాన్యం రాశులు కళ్ల ముందే తడిసిపోతుంటే ఆ దృశ్యాలు చూసి కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులు జిల్లావ్యాప్తంగా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.కల్లాల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన కర్షకులు చెప్పనలవికాని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పగలు రాత్రి కష్టపడి సాధించిన దిగుబడులను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి మార్కెట్ యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కల్లాల వద్ద, రోడ్ల పక్కన కుప్పలు పోసిన ధాన్యం వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. రోడ్లపైనే వరి కుప్పలు భారీగా పేరుకుపోవడంతో అటు వాహనదారులకు సైతం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

గత రెండు మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని సాత్నాల, బేలా, జైనథ్, భోరజ్ మండలాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మార్కెట్ కేంద్రాల వద్ద ఆరుబయట నిల్వ ఉంచిన ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు వాగుల్లా ప్రవహించడంతో వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా తాంసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ ఆరబోసిన జొన్న పంటతో, నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులతో కిటకిటలాడుతోంది. కంటికి రెప్పలా కాపాడుకున్న జొన్న కుప్పలు అడపాదడపా కురుస్తున్న వానలకు తడిసిపోతుండటంతో వాటిని పదేపదే ఎండబెట్టుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తూ అలిసిపోతున్నారు. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగడానికి ప్రధానంగా గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత కారణమని స్పష్టమవుతోంది. నిండిన బస్తాలను తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడం, తూకాలు వేసేందుకు తగినంత మంది కూలీలు దొరకకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం పదిహేను ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల క్వింటాళ్ల వరిని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోవడంతో వారం రోజులు గడిచినా రైతుల నిరీక్షణ యథాతథంగా కొనసాగుతూనే ఉంది. బస్తాల కొరత అన్నదాతల పాలిట పెను శాపంగా మారింది. క్షణం క్షణం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతుల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తున్నాయి.

అమరుల త్యాగాలు భావి తరాలకు స్ఫూర్తిదాయకం

-రాష్ట్రావతరణ వేడుకలో డాక్టర్ కవ్వంపల్లి

కరీంనగర్ జిల్లా ప్రతినిధి : ఉదయం న్యూస్ , జూన్ 02
కరీంనగర్ జిల్లా

ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడూతూ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు భావి తరాలకు స్ఫూరిదాయకమని పేర్కొన్నారు. అమరుల త్యాగాలు మరువలేనివన్నారు. తెలంగాణ ఏర్పాటుతో ప్రజల ఆకాంక్షలు నెరవేరే దిశగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఆ కృషి ఫలితంగానే పలు రంగాల్లో అభివృద్ధి సాధ్యమైందని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. రాష్ట్ర పురోగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కంది అశోక్ రెడ్డి, తమ్మనవేణి రమేశ్ , మామిడి అనిల్ కుమార్, చింతిరెడ్డి లక్ష్మారెడ్డి, బుధారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి,పోతుగంటి శ్రీనివాస్, అయితం మహేశ్, వడ్లూరి స్వామి, చంటి తదితరులు పాల్గొన్నారు.

బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి ప్రతి బడిఈడు చిన్నారిని పాఠశాలలో చేర్పించాలి

నంద్యాల, జూన్ 02:- ఉదయం న్యూస్ ప్రతినిధి

జిల్లాలో ఒక్క బడిఈడు చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చూడడమే లక్ష్యంగా "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, పాఠశాల వెలుపల ఉన్న ప్రతి చిన్నారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో "బడి పిలుస్తోంది" కార్యక్రమం అమలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఐదేళ్లకు పైబడిన పిల్లల విభాగంలో మొత్తం 14 వేల మంది చిన్నారులను పాఠశాలల్లో చేర్చే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం 8,778 మంది పిల్లలు నమోదు కాగా, ఈ సంఖ్యను తక్షణమే 10 వేల మందికి పెంచేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 14,248 అడ్మిషన్ల లక్ష్యానికి గాను ప్రస్తుతం 8,778 అడ్మిషన్లు నమోదయ్యాయని, మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన సాధించే దిశగా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే రెండవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 1,31,974 అడ్మిషన్ల లక్ష్యానికి గాను 1,17,920 అడ్మిషన్లు పూర్తయ్యాయని, ప్రస్తుతం 89.33 శాతం నమోదైన ప్రవేశాలను 90 శాతానికి పైగా పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.మొదటి తరగతి అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, పాఠశాలల్లో ఇంకా చేరని పిల్లలను ఇంటింటికీ వెళ్లి గుర్తించి ప్రవేశాలు కల్పించాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసి ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల మొదటి తరగతిలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేసి జిల్లాలో విద్యా నమోదు శాతాన్ని మరింత పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నంద్యాలలో ఇల్లు లేని నిరుపేదల కోసం పోరుబాట సిపిఐ

నంద్యాల .జూన్ 2:- ఉదయం న్యూస్ ప్రతినిధి

నంద్యాల పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదల కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సిపిఐ సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు డి శ్రీనివాసులు మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి పి సుశీలమ్మ మహిళా నాయకురాలు సరోజమ్మ పాల్గొన్నారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు వేల సంఖ్యలో ఉన్నారు గత సంవత్సరము నుండి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో అన్ని వార్డులలో తిరిగి ఇల్లు లేని వారిని వెరిఫై చేసి వారితో ఇంటి స్థలాల అర్జీలను వ్యక్తిగతంగా సచి వాలయాల దగ్గర ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ఇప్పించడం జరిగింది రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇల్లు లేని వారికి పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి భవన నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇవ్వడం జరిగింది కానీ ఎన్నికలు అయిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చినాక అద్దోపులి. ఇదో మేక అంటూ ప్రజలను ఊరిస్తూ కాలయాపన చేస్తున్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నంద్యాలలో 4.6.2026. గురువారం ఉదయం 10 గంటలకు సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో విద్యార్థి యువజన ప్రజా సంఘాలతో రైతు . వ్యవసాయ కార్మిక ట్రేడ్ యూనియన్లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వారి మద్దతు కూడగట్టి పట్టణంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు వచ్చేంతవరకు పోరాడుతామని అన్నారు

ఈ నెల 8 తేదిన నిర్వహించనున్న యోగ కార్యక్రమ, స్థల పరిశీలన ఏర్పాట్లను పరిశీలించిన.

జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ.

ఉదయం ప్రతినిధి

ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు, జూన్ : 02, 'యోగాంధ్ర ఉద్యమం - 2026' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండం వద్ద శనివారం (8వ తేదీన) జరగనున్న యోగా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి మత్స్య గుండాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మత్స్యగుండం పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నెల 8తేదీన యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి, ఏర్పాట్లపై సమీక్షించారు. ఉద్యమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, యోగ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, భద్రత, మౌలిక వసతుల కల్పనపై స్థానిక అధికారులకు ఆమె పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో మాజీ సర్పంచ్ మటన్ శాంతి కుమారి, మండల తహసిల్దార్, ఎంపీడీవో రమాదేవి ,జిల్లా, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ రామాంజనేయులకు ఘన సన్మానం

తుగ్గలి: ఉదయం న్యూస్:

తుగ్గలి మండల పరిధిలోని గల ముక్కెళ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన రామాంజనేయులు పదవీ విరమణ చేయడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఆయనకు మంగళవారం రోజున ఘనంగా సన్మానం నిర్వహించారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేసిన రామాంజనేయులు,ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన అధికారిగా గుర్తింపు పొందారు.గ్రామస్థులతో ఆప్యాయంగా మెలుగుతూ,ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడంలో చూపిన నిబద్ధత ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. పూలమాలలు,శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పలువురు ఉద్యోగులు భావోద్వేగానికి లోనై ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వమోహన్, డిప్యూటీ ఎంపీడీవోలు పి. శ్రీహరి, మారుతి ప్రసాద్ మాట్లాడుతూ రామాంజనేయులు నిజాయితీ, క్రమశిక్షణ,సేవాభావానికి ప్రతీకగా నిలిచారని అన్నారు.ఉద్యోగ జీవితంలో ఆయన చూపిన అంకితభావం యువ ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.సన్మానానికి స్పందించిన రామాంజనేయులు తన ఉద్యోగ జీవితంలో సహకరించిన అధికారులు, సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ప్రేమాభిమానాలు తనకు జీవితాంతం మరిచిపోలేని ఆస్తి అని భావోద్వేగంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,మండల పరిషత్ ఉద్యోగులు,రెవెన్యూ శాఖ సిబ్బంది,ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు,మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని రామాంజనేయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా నాయకుడు చిన్ని కృష్ణ ఆధ్వర్యంలో ఆర్మీకి ఎంపికైన సుద్దల హేమంత్ కుమార్ యాదవ్‌కు ఘనంగా అభినందనలు.

ఆర్మీకి ఎంపికైన హేమంత్ కుమార్ ను అభినందిస్తున్న నాయకులు.
ఉదయం న్యూస్ రుద్రవరం.

మండలంలోని టీ,లింగందిన్నె గ్రామ ప్రజా నాయకుడు చిన్ని కృష్ణ ఆధ్వర్యంలో సుద్దల హరీష్ కుమారుడు సుద్దల హేమంత్ కుమార్ యాదవ్ భారత ఆర్మీకి ఎంపిక కావడం పట్ల వర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సోమవారం ఘనంగా కేక్ కట్ చేసి అభినందించారు.ఈ సందర్భంగా ప్రజా నాయకుడు చిన్ని కృష్ణ మాట్లాడుతూసుద్దల హేమంత్ కుమార్ యాదవ్ సాధించిన ఈ విజయం గ్రామానికి గర్వకారణమని దేశ సేవ కోసం భారత ఆర్మీలో అడుగుపెట్టడం ఎంతో గౌరవప్రదమైన విషయమని పేర్కొన్నారు. కష్టపడి సాధించిన ఈ విజయంతో హేమంత్ కుమార్ యాదవ్ గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు.
అలాగే ప్రజా నాయకుడు చిన్ని కృష్ణ హేమంత్ కుమార్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భారత ఆర్మీలో అత్యున్నత స్థాయికి చేరుకుని గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, అభిమానులు పాల్గొని సుద్దల హేమంత్ కుమార్ యాదవ్‌కు ఘనంగా అభినందనలు తెలియజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక.

ఉదయం న్యూస్ చాగలమర్రి

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1983-1984 వ సంవత్సరం చదువుకున్న పూర్వ విద్యార్థుల కలయికతో ఆదివారం సమావేశమయ్యారు.దాదాపుగా రెండు సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.యోగక్షేమాలు అడిగి తెలుసుకన్నారు.విద్యార్థి దశలో తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకుని మురిసిపోయారు.అనంతరం గురువులు వెంకట్ రెడ్డి , ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవయ్య లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు జెట్టి నాగరాజు , వల్లం రాము , బోధనం లక్ష్మయ్య యాదవ్ , బచ్చు సుబ్రమణ్యం , వంకదార లక్ష్మణబాబు , బడిగేంచల చక్రపాణి , సుబ్బనరసయ్య , రామచంద్ర రెడ్డి , తదితర తోటి విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్ బ్యాంకులో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కరీంనగర్ జిల్లా ప్రతినిధి : ఉదయం న్యూస్ , జూన్ 02 :

కరీంనగర్ పట్టణం సహకార అర్బన్ బ్యాంకు కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా బ్యాంకు అధ్యక్షుడు కర్ర రాజశేఖర్ జాతీయ పతాకాన్ని ఎగరవేసి ..సిబ్బందికి , ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలిపారు . అనంతరం తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన ఎందరో మహానుభావులకు నివాళు లర్పించారు . తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన కొనియాడారు . ప్రజల సంక్షేమం , ఆర్థిక పురోగతిలో బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు .ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ

విద్యాశాఖ అధికారులు ఎండి. ఖాసీం, వై. శ్రీనివాసరావు వెల్లడి

పిడుగురాళ్ల, ఉదయం న్యూస్, జూన్ 02 :

ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను మండల కేంద్రం పాయింట్ నుండి ఆయా పాఠశాలల సిఆర్పిల ద్వారా అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాల కు పంపడం జరుగుతుందని పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారులు ఎండీ ఖాసీం, వై శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పిడుగురాళ్ల మండలంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలు తెరిచే నాటికి పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచటం తో పాటు పాఠ్యపుస్తకాలను తరగతుల వారీగా, సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులందరూ తమ క్యాచ్ మెంట్ ఏరియాలో ఉన్న విద్యార్థులందరినీ, తల్లిదండ్రుల మరియు సిఆర్పిల సహకారంతో తమ పాఠశాలలో చేరే విధంగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వము ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలతో పాటు, ఉచితంగా అందిస్తున్న అన్ని రకాల కిట్స్ మరియు పుస్తకాలను, ప్రభుత్వ పాఠశాలలో చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు నాగేశ్వరరావు, సాగర్ రాజు, పార్వతయ్య, కుమారి చాంద్ బి మరియు ఆఫీసు సిబ్బంది వీరనారాయణమ్మ, లలిత, ఐఇ ఆర్టి కె. హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయక నిధి కింద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సీఎం నారా చంద్రబాబునాయుడు గారు...

ఉదయం న్యూస్ ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ తాలూకాకు సంబందించిన బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేసిన ఆళ్లగడ్డ టిడిపి సీనియర్ నాయకుడు భార్గవ్ రామ్ గారుసీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తీసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారికి, సీనియర్ నాయకుడు భార్గవ్ రామ్ గారికి,సీఎం నారా చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది...

చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

ప్రజా తీర్పును తుంగలో తొక్కిన పాలనపై 4న మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం.
వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి.

తుగ్గలి:ఉదయం న్యూస్:

ప్రజలు ఇచ్చిన తీర్పును,ప్రజాస్వామ్య విలువలను, సంక్షేమ పాలనను దెబ్బతీస్తూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో జూన్ 4 నుంచి 12 వరకు విస్తృత నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తోందని వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్, మండల అధ్యక్షుడు అట్ల గోపాల్ రెడ్డి లు తెలియజేశారు.మంగళవారం రోజున విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో భాగంగా జూన్ 4వ తేదీన ఉదయం 10 గంటలకు మండల కేంద్రమైన తుగ్గలి లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పత్తికొండ మాజీ ఎమ్మెల్యే,నియోజకవర్గ కోఆర్డినేటర్ కంగాటి శ్రీదేవి హాజరవుతారని వారు తెలియజేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తూ, రైతులు,మహిళలు,యువత, విద్యార్థులు,పేద ప్రజల ఆశలను అడియాసలు చేసిన చంద్రబాబు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించనున్నారని వారు తెలియజేశారు.అలాగే రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై పార్టీ శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పించనున్నారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు,కార్యకర్తలు, మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు,మాజీ ఎంపీటీసీలు,మండల కమిటీ నాయకులు,మండల అనుబంధ సంఘాల నాయకులు, గ్రామ కమిటీ నాయకులు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,మండల అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి లు తెలియజేశారు.

జొన్నగిరిలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక... తహసిల్దార్ రవి

భూ సమస్యల దరఖాస్తుల స్వీకరణ.

తుగ్గలి:ఉదయం న్యూస్: తుగ్గలి మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బుధవారం రోజున "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తుగ్గలి తహసిల్దారు రవి పాత్రికేయులకు తెలియజేశారు.మంగళవారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జొన్నగిరి,గుత్తి ఎర్రగుడి,పగిడిరాయి గ్రామాలు మరియు వాటి మజరా గ్రామాల ప్రజలు పాల్గొని వారి భూ సమస్యలు,ఇతర ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు మరియు రెవెన్యూ సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలియజేశారు.కావున సంబంధిత గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించాలని తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.

అంధకారంలో విద్యాధికారులు!

బేతంచర్ల, ఉదయం న్యూస్

: బేతంచర్ల మండలంలో యదేచ్ఛగా ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు తుంగలతో 13వ తారీకు నుండి పాఠశాలలు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ముందస్తుగానే ప్రైవేటు పాఠశాలలను తెరచి తరగతుల ప్రారంభించి, ఉపాధ్యాయుల చేత అడ్మిషన్లు అంటూ మండుటెండలో వీధిల వెంట తిప్పుతూ ఒక సేల్స్ మెన్ ఉద్యోగాన్ని కూడా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం చేయిస్తున్నాయి. విపరీతమైన ఎండ ఉంది ఐదు గంటల తర్వాత బయటికి రావాలి అని ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం మా పాఠశాలల గురించి ప్రచారం చేయాలంటూ హుకుం జారి చేస్తున్నాయి ఎండల కారణంగా ఉపాధ్యాయులకు జరగరానిది ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని వాళ్ళ కుటుంబానికి ఆధారం ఎవరు చూపిస్తారని ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘాలు అంటున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యాధికారుల చేత పాఠశాలలను తనిఖీ చేయించి వెంటనే ముందస్తుగా తెరిచిన పాఠశాలలను వెంటనే మూయించి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని ప్రభుత్వ ఆదేశానుసారం పాఠశాలలు తెరిచే విధంగా చూసే బాధ్యత విద్యాధికారుల పైన ఉందని ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం నాయకులు అధికారులను హెచ్చరిస్తున్నారు.

కారంపూడి మండల వైసిపి మైనారిటీ సెల్ ఉపాధ్యక్షునిగా దర్గా. సుభాని నియామకం

కారంపూడి, ఉదయం న్యూస్, జూన్ 0 2 :

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షునిగా దర్గా. సుభాని నియమితులయ్యారు. సుభాని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో క్రియశీలక కార్యకర్తగా పనిచేస్తూ పార్టీకి అనేక సేవలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు కారంపూడి మండలం మైనారిటీ సెల్ ఉపాధ్యక్షునిగా మాచర్ల మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి సిఫార్సు మేరకు సుభానికి ఈ పదవి అధిష్టానం కట్టబెట్టింది. తన నియామకానికి సహకరించిన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి, పిన్నెల్లి. వెంకటరామిరెడ్డి మరియు కారంపూడి మండల వైసీపీ నాయకులకు అయన ధన్యవాదములు తెలిపారు. దర్గా. సుభాని నియామకం పట్ల పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు సుభానికి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి : ఉదయం న్యూస్

జూన్ 02 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే జాతీయ జెండాను ఆవిష్కరించి జిల్లా ప్రజలకు , పోలీస్ అధికారులకు , సిబ్బందికి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి,భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ప్రజల భద్రత, శాంతి పరిరక్షణ కోసం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ వేడుకల్లో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు,ఏ.ఓ పద్మ,సి.ఐ శ్రీనివాస్, నాగేశ్వరరావు,వెంకటేష్,రవీందర్,మొగిలి,రవి, ఆర్.ఐ లు మధుకర్, సురేష్, ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో కూడా అవినీతిమయం తినే ఆహారం పైన కూడా కమిషన్

ఎమ్మిగనూరు ఉదయం న్యూస్ ప్రతినిధి

తిరుపతి టు కర్నూల్ బస్సు కర్నూల్ 2 డిపో అశీ.ూ్రా39 ఓ 0781 గల బస్సు ఆర్లగడ్డ దాటిన తర్వాత మధ్యలో అడవుల్లో ఓకే హోటల్ అబీద్ హోటల్ నాన్ వెజ్ భోజనం హోటల్ ప్రతి ఒక్కరు ఇక్కడే భోజనం చేయాలని డ్రైవర్ ఆపి చెప్తున్నాడు ఇక్కడ తప్ప బస్సు మరి ఎక్కడ ఆగదు డైరెక్టు కర్నూల్లోనే ఆపుతున్నాం అని డిమాండ్ చేస్తున్నాడు ప్రతి ఒక్కరూ ఇక్కడే భోజనం చేయాల్సిందే అని తెగేసి చెబుతున్నాడు మహా పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని ఎంతో భక్తితో దర్శనం ముగించుకొని తిరిగి వచ్చే ప్రయాణంలో కర్నూల్ కి వచ్చే భక్తులు అటువంటిది ఆళ్లగడ్డ దాటిన తర్వాత అడవుల్లో ఆపి నాన్వెజ్ హోటల్ లో భోజనం ఎలా చేస్తారు సార్ డ్రైవర్ ఏమని అడిగితే ప్రతి ఒక్కరు ఇక్కడే భోజనం చేయాల్సిందే లేకపోతే లేదు అని అసభ్యంగా మాట్లాడుతున్నాడు దీనికి కర్నూలు జిల్లా అధికారాలు ఆర్ఎం నీ ఫోన్ చేసి తిరుపతి టు కర్నూల్ బస్సులో ఆర్లగడ్డ దాటిన తర్వాత నాన్ వెజ్ హోటల్ లో భోజనం ఎలా చేస్తారు సార్ మహా పుణ్యక్షేత్రమైన తిరుపతి పోయిన భక్తులు నాన్ వెజ్ ఎలా తింటారు సార్ అని ఆర్ ఎం ని వివరణ కోరగా డిపో మేనేజర్ నెంబర్ ఇచ్చారు డిపో మేనేజర్ పొత్తన లేని సమాధానం తెలుపుతున్నారు

కలెక్టరేట్లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

కరీంనగర్ జిల్లా ప్రతినిధి : ఉదయం న్యూస్ , జూన్ 02 :

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట కలెక్టర్ చిత్రా మిశ్రా జాతీయ జెండాను ఆవిష్కరించారు . అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు . తదుపరి బాలికలకు నోటు పుస్తకాలు , కంపాస్ బాక్సులు అందజేశారు . ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని విద్యార్థినిలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వెన్నుపోటుకు రెండేళ్లు... మోసాలు, నయవంచనపై పుస్తకం, పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ... వైసీపీ

నంద్యాల జూన్ 2:- ఉదయం న్యూస్ ప్రతినిధి

తెలుగునాట ప్రజాస్వామ్యం నిలువునా వంచనకు గురైందా? అధికార పీఠం కోసం ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? నమ్మి ఓటేసిన రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన బహుమతి "వెన్నుపోటు" మాత్రమేనా?అవునంటోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ! నేడు నంద్యాల వేదికగా వైసీపీ జిల్లా కార్యాలయంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల వైఫల్యాలపై వైసీపీ నేతలు జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్యే లు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బీజేంద్రనాథ్ రెడ్డి, సిఇసి మెంబర్ పి.పి నాగిరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పి.పి మధుసూదన్ రెడ్డి, హాజరై వెన్నుపోటు రెండేళ్లు...కూటమి ప్రభుత్వ మోసాలపై పుస్తకం, వాల్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి యుద్ధభేరి మ్రోగించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో..

జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 2 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా... ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చలేదని, రాష్ట్ర ప్రజలను నయవంచన, మోసం చేసి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలను కల్పించలేదని నిరుద్యోబృతి మహిళలకు శ్రీనిధి పథకం అమలుకలేదని తల్లికి వందనం, రైతుభోరోసా వంటి పథకాలను పూర్తిస్థాయిలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేది, మొక్కజొన్న రైతులను నట్టేట ముంచారని, అలాగే జొన్నల కొనుగోలుకూడా అరకొరగా చేపట్టారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మీడియా ప్రతినిధులకు మూడు బెడ్‌రూమ్‌ల ఇళ్లు ఉచితంగా ఇస్తామని నంద్యాల శ్రీనివాస్ సెంటర్‌లో ప్రకటించిన హామీని సైతం ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.ప్రజలతో పాటు మీడియా ప్రతినిధులను కూడా మోసం చేసిన ప్రభుత్వం ఇదేనని విమర్శించారు .2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీడియా ప్రతినిధుల సొంతింటి కలను సాకారం చేస్తారని చెప్పారు..!! "విజన్ కాదు.. వెన్నుపోటే టీడీపీ నైజం" అంటూ మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు ఆకాశమే హద్దుగా హామీల వర్షం కురిపించారని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. టీడీపీ రెండేళ్ల వైఫల్యాలను ఎండగట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశాల్లో జగన్నామస్మరణ తప్ప రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రస్తావించలేదన్నారు. డైవర్ట్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. నంద్యాల నియోజకవర్గంలో సీనియర్ మంత్రి ఈ రెండేళ్ల పాలనలో నంద్యాలలో ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదని, వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో చేపట్టిన పనులను నేటికి పూర్తి చేయలేదని 6సార్లు మంత్రి పదవిలో ఉన్న సీనియర్ నాకయుడు నంద్యాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. నంద్యాలలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్సార్ విగ్రహాన్ని నడిబొడ్డులో సీసీ కెమెరాల మధ్య పట్టపగలు విగ్రహాన్ని ధ్వంసం చేస్తుంటే పోలీసు వ్యవస్థ పర్యవేక్షణలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంలో విధ్వంస దృశ్యాలను చూస్తూ ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఇది పోలీసు నిఘావైఫల్యంగా భావిస్తున్నామన్నారు. ఒక పథకం ప్రకారం విగ్రహాన్ని ధ్వంసం చేసి వైసీపీ కార్యకర్త అని ముద్రవేసి పథక రచన చేశారని, టీడీపీ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి గురించిన వివరాలను ఫోటోలను ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం దారుణంగా ఉందన్నారు. ఆ వ్యక్తి పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టకపోగా టీడీపీ వారు ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారం వ్యవహరించారని విమర్శించారు. మతిస్థిమితం లేదని ఒక సారి, వైసీపీ కార్యకర్త అని మరోసారి ఇలా వారు ఇష్టం వచ్చినట్లుగా పోలీసులు వంతపాడారని అన్నారు. తమకు నచ్చిన రీతిగా స్టేట్మెంట్ తీసుకొని బెయిలబుల్ కేసును నమోదు చేశారని పేర్కొన్నారు. కేవలం తమ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు సంనయాన్ని పాటించమన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే విగ్రహధ్వంసం కుట్ర జరిగిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గం పరిశీలకుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్స్ రామలింగా రెడ్డి, సాయినాథ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాల్మిల్ అమీర్, మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృతారాజ్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పురుషోత్తమ రెడ్డి, జిల్లా ఎస్టీ కార్యవర్గ సబ్యులు శంకర్ నాయక్, వైసీపీ నాయకులు లాల్ స్వామి, సాయిరాం రెడ్డి, కృష్ణ మోహన్, శ్రీకాంత్ రెడ్డి, మునయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపు డాన్ సునీల్

బద్వేలు కేంద్రంగా సంవత్సరాల తరబడి రేషన్ బియ్యం తరలిస్తున్న సునీల్ ఎన్నోసార్లు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని లారీలను పట్టుకున్న అధికారులు అయినా పద్ధతి మార్చుకొని సునీల్ రేషన్ బియ్యం తరలించే విషయంలో సునీల్ సోదరుల కీలక పాత్ర ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే పక్క రాష్ట్రాలకు ప్రతినెల రేషన్ బియ్యం తరలింపు

బద్వేలు ఉదయం ప్రతినిధి

బద్వేలు కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతుంది రేషన్ బియ్యం తరలించే డాన్ గా బద్వేలు వాసి సునీల్ కు పేరు ఉంది సునీల్ తో పాటు ఆయన సోదరులు రేషన్ బియ్యం తరలించడం లో క్రియాశీలక పాత్ర పోజిస్తున్న విషయం అందరికీ తెలిసిందే కొన్ని సంవత్సరాలుగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతుంది రేషన్ బియ్యం తరలింపు విషయం సంబంధిత అధికారులకు తెలిసి కూడా నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు నెలవారీ ముడుపులకు అలవాటు పడిన అధికారులు చర్యలు తీసుకునే విషయములో మీనమేషాలు లెక్కపెడుతున్నారు కేవలం నామ మాత్రపు దాడులతో సరిపెడుతున్నారు ఉమ్మడి కడప జిల్లాలో ఎక్కడ రేషన్ బియ్యం అధికారులకు పట్టుబడితే దాని మూలాలు బద్వేల్ కేంద్రంగా కావడం విశేషం ఇటీవల పలు ప్రాంతాల్లో అధికారులు జరిపిన దాడుల్లో పెద్ద స్థాయిలో రేషన్ బియ్యం పట్టుకున్నారు

నెలవారి ముడుపులు

బద్వేల్ లో రేషన్ బియ్యం స్మగ్లర్గా పేరుపొందిన సునీల్ అధికారులకు నెలవారి ముడుపులు చెల్లిస్తున్నట్లు సమాచారం అతనిని ఎవరైనా ప్రశ్నిస్తే రేషన్ బియ్యం తరలింపు మానుకున్నానే సమాధానం వస్తుంది ఇలాంటి కాకమ్మ కబుర్లు ఎప్పటినుంచో చెబుతున్నాడు రేషన్ బియ్యం స్పాకింగ్తో కొన్ని కోట్ల రూపాయలు సునీల్ సంపాదించినట్లు సమాచారం తమిళనాడు కర్ణాటక ఒరిస్సా తదితర రాష్ట్రాలతో పాటు

తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లోని అన్ని జిల్లాలకు రేషన్ బియ్యం తరలిస్తుంటాడు ఇతని కింద మరో 10 మంది వరకు స్మగ్లర్లు ఉన్నట్లు సమాచారం బద్వేల్లో పలుచోట్ల రేషన్ బియ్యం దాచి ఉంచేందుకు ప్రత్యేకంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది అంతేకాకుండా బద్వేలు పోరుమామిళ్ల మైదుకూరు తదితర ప్రాంతాల్లో కొన్ని రైస్ మిల్లులు అద్దెకు తీసుకొని

రేషన్ బియ్యాన్ని అక్కడ పాలిష్ చేయించి బియ్యం అమ్మేవారికి ఇస్తున్నట్లు సమాచారం

ఇదంతా బియ్యం స్మగ్లర్ సునీల్ ఆధ్వర్యంలోనే నడుస్తుంది ఇది కూడా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం అధికారంలో ఎవరు ఉంటే వారికి కాకాలు పట్టడం సునీల్ కు వెన్నతో పెట్టిన

విద్య. ఉమ్మడి కడప జిల్లాలో రేషన్ బియ్యం స్మగ్లింగ్ జరుగుతున్నప్పటికీ బద్వేలు మాత్రం ప్రత్యేకం ప్రతినెల టన్నులకొద్ది రేషన్ బియ్యం పక్క రాష్ట్రాలకు తరలిపోతుంది ఈ విషయం సంబంధిత అధికారులకు కూడా బాగా తెలుసు కానీ నెలవారి ముడుపులు వారి నోరు నొక్కేస్తున్నాయి అధికారుల నిఘా అంతంత మటుకేఅధికారులు గట్టిగా పని చేస్తే రేషన్ బియ్యం అక్రమాలకు కొంతవరకైనా అరికట్టవచ్చు వేల కొద్ది బియ్యం బస్తాలు బద్వేల్ నుంచి ప్రతి నెల తరలిపోతూనే ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసే అధికారులు లేకుండా పోయారు అధికారుల అలసత్వం

స్మగ్లర్ సునీల్ కు ఇతరులకు బలంగా మారింది

నన్ను సస్పెండ్ చేసే అర్హత మండల అధ్యక్షుడికి లేదు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి : ఉదయం న్యూస్

జూన్ 02 : నన్ను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసే అధికారం మండలాధ్యక్షునికి లేదని బద్దం ఎల్లారెడ్డి మాజీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అన్నారు పదవులు పైరవీలు,కమీషన్లు తప్పా.. నీకు పార్టీని నడపడం చేత కాదు. ఒక్క ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడం చేత కాదు కానీ సస్పెండ్ చేసుడు మాత్రం తెలుసా నీ మండల అధ్యక్ష నాయకత్వం అంటే ఇప్పుడు తెలిసింది మండల ప్రజలకు . అసలు నీకేం అర్హత ఉందని ఆ పదవిలో కొనసాగుతున్నావ్ ? అని మండి పడ్డాడు షాడోతో జత కట్టి మండలాన్ని భ్రష్టు పట్టిస్తున్న మీ ముగ్గురికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు, కార్యకర్తలు గట్టిగా బుద్ధిఈ చెప్తారు. గుర్తు పెట్టుకొండి అని ఎద్దేవా చేశారు నేను పార్టీని వదిలే ఆలోచన చేసిన రోజు నుండే

పార్టీలో జరుగుతున్న అరాచకాలపై ప్రశ్నించడం మొదలు పెట్టిన. మీనిజ స్వరుపాలు బయట పెట్టిన తరువాత మీరు గ్రామాలలో ఎలా తిరుగుతారు గుర్తు పెట్టుకోండి

గాలిపల్లి పి ఎ సి ఎస్ (ూ్రూజూ) చైర్మన్ పదవి అమ్ముకొని....గాలిపల్లి గ్రామంలో కొత్తగా వచ్చిన 82 ఏండ్ల యువ నాయకుడు సింగిరెడ్డి సుధాకర్ రెడ్డిని పార్టీలో చేర్చుకొని రాజకీయ ఆటలు ఆడుతున్న రోజే నిర్ణయించున్నాను. 7 గ్రామాల పరిధిలోని 350 మంది రైతులను ముంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఒక అవినీతిపరుడు ఉన్న పార్టీలో నేను ఉండనని నిర్ణయించుకున్నాకే మిమ్మల్ని ప్రశ్నించడం మొదలు పెట్టాను. అతడు పార్టీలో ఉంటే కాంగ్రెస్ పార్టీ చెడ్డ పెరు వస్తుంది అలా నేను కూడా పార్టీలో ఉంటే నాకు చెడ్డ పేరు వస్తుందని నిర్ణయించుకున్నాను కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో వచ్చిన నన్ను ఇదేంటని అడుగుతే పార్టీ నుండి సస్పెండ్ చేస్తారా .....?? నాకు నచ్చి పార్టీ లోకి రాలేదు నేను కాంగ్రెస్ పార్టీలోకి.. ఎమ్మెల్యే కవ్వంపల్లి ఇల్లంతకుంటలో పార్టీ పరిస్థితి బాగాలేదని బ్రతిమిలాడితే వచ్చి పార్టీని భుజాల మీద వేసుకొని రాత్రనక పగలనక తిండి తిప్పలు లేక కష్టపడ్డాను. ఇది నా ఒక్కడి ఆవేదన కాదు.. నియోజకవర్గం మొత్తం ఇదే పరిస్థితి.అందులో ఇల్లంతకుంట మండల మాజీ నాయకులు , కార్యకర్తలది మరి దారుణమైన పరిస్థితి.బయటకు రాని ఎంతో మంది నలిగి కుమిలి పోతున్నారు. యువ నాయకుడు

గతంలో వేణుగోపాల సొసైటీని ఎన్ని కోట్లకు ముంచాడో ప్రజలకు తెలియదనుకుంటున్నావా? అధ్యక్షా ?? కష్టపడ్డ కార్యకర్తలకు కాకుండా సంచులు మోసిన వాళ్లకు పెత్తనం ఇస్తారా? ఎన్నికల వేళ ముందే చెప్పండి. మాకు డబ్బు సంచులు తెచ్చేవాళ్ళే కావాలి పేద నాయకులు వద్దు, పేద కార్యకర్తలు వద్దు అని చెప్పి ఊళ్ళల్లో తిరగండి.ఆ ముగ్గురు చేస్తున్న అరాచకాలతో జెండా మోసిన పేద నాయకులు, కార్యకర్తలు నలిగిపోతున్నారు.

కష్టపడి పార్టీని నిలబెట్టిన వారిని పక్కన పెట్టి... డబ్బులు, సెటిల్మెంట్లు చూసుకునే వాళ్లకు పెద్దపీట వేస్తే కార్యకర్తల ఆవేదన ఎప్పటికైనా పేలుతుంది!గుర్తుపెట్టుకో...షాడో నిజం మాట్లాడే గొంతును ఎవరూ ఆపలేరు! ప్రజలు అన్నీ గమనిస్తున్నారు...సమయం వచ్చినప్పుడు సమాధానం కూడా వాళ్లే చెబుతారు అని బద్దం ఎల్లారెడ్డి మండి పడ్డారు.

రెడ్ క్రాస్ సొసైటీలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు.

కరీంనగర్ జిల్లా ప్రతినిధి : ఉదయం న్యూస్ , జూన్ 02 :

మంగళవారం ఉదయం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ లో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవ రెడ్డి జెండా ఎగురవేయడం జరిగింది . అనంతరం తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఊట్కూరి రాధ కృష్ణ రెడ్డి,కమిటీ సభ్యులు సాన వేణు, ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, డి. క్రిష్ణ మూర్తి మరియు జి. ఓంకార్ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు

నక్కలదిన్నె పి హెచ్ సికి దాతల సహకారం...

బ్రహ్మంగారిమఠం ఉదయం ప్రతినిధి

చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల సౌకర్యార్థం కోసం కొంత మంది దాతలు సహకారం అందించినట్లు నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు తెలియజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొన్ని వసతులు లేని కారణంగా కొంత మంది దాతలు ముందుకు వచ్చి కొన్ని పరికరాలు, స్టేషనరీ ఐటమ్స్, నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

మైదుకూరు పట్టణానికి చెందిన డాక్టర్ మాచనూరు శృతి తరుపున వారి తండ్రి జిల్లా బిజె పి ఉపాధ్యక్షుడు మాచనూరు సుబ్బారాయుడు ఆరోగ్య కేంద్రానికి కావలసిన స్టేషనరీ ఐటమ్స్ ఇచ్చారని, చాపాడు మండలానికి చెందిన వెన్నపూస కిశోర్ కుమార్ రెడ్డి ఆక్వాగార్డ్ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారని డాక్టర్ ఓబులేసు తెలియజేశారు. అలాగే శెట్టిపల్లె నాగేశ్వర్ రెడ్డి, నందిమండం మల్లిఖార్జున రెడ్డి ,పిహెచ్ సి కి ప్రింటర్ ను ఇచ్చారని, ఆరోగ్య కేంద్రానికి వస్తువులు ఇచ్చి సహకారం అందించిన దాతలను డాక్టర్ సూపర్ వైజర్స్, యం ఎల్ హెచ్ పి లు, ఎ ఎన్ యం లు, ఆశా కార్యకర్తలు, కలిసి చిరు సన్మానం చేసి వారికి కృతజ్ఞతలు తెలియజేసి వారిని అభినందించారు. అలాగే ప్రొద్దుటూరు చెందిన

సాధన నర్సింగ్ కాలేజీ వారు 150 మీటర్స్ పైపులు,నీటి బిందెలు ఆసుపత్రికి అందించారని తెలిపారు.

ఆసుపత్రి అభివృద్ధికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమంలో చాపాడు బిజె పిమండల అధ్యక్షుడు చిన్న గోపాల్ రెడ్డి, బిజెపి నేతలు,, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు...

సిద్దిపేట జిల్లా డిగ్రీ కళాశాల మైదానంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న

సిద్దిపేట ప్రతినిధి, ఉదయం న్యూస్

తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు విచ్చేసిన అమరవీరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు, ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, పుర ప్రముఖులకు, అధికారులకు, అనధికారులకు,మీడియా ప్రతినిధులకు,కార్మిక, కర్షక, విద్యార్థిని,విద్యార్థులకు నా హృదయపూర్వక తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు.

తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు,అది కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక.

త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ అభివృద్ధి మరియు సంక్షేమానికి చిరునామాగా నిలిచింది. దాశరథి కృష్ణమాచార్యులు చెప్పినట్లుగా నా తెలంగాణ కోటి రత్నాల వీణ ఆ వీణ అభివృద్ధి రాగాలు పలుకుతోంది.కాళోజీ నారాయణరావు కలలు కన్న ప్రజల తెలంగాణను ప్రజా పాలన ప్రభుత్వంలో మరింత సమానత్వంతో,మరింత ప్రగతితో ముందుకు తీసుకెళ్తున్నాం.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి,వారు సద్వినియోగం చేసుకునేలా గ్రామ స్థాయి వరకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరుతో 6 మార్చి నుండి 12 జూన్ వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ సందర్భంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు,చేపట్టిన చర్యలు మరియు సాధించిన ప్రగతిని మీ ముందుంచుతున్నాను.

కోహెడ గ్రామ అభివృద్ధి నా లక్ష్యం: సర్పంచ్ బందెల సుజాత

కోహెడ ప్రతినిధి, ఉదయం న్యూస్

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కోహెడ గ్రామ సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్ మాట్లాడుతూ. కోహెడ గ్రామ అభివృద్ధి ముందంజలో గ్రామాన్ని సర్వ సుందరంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమని ఆమె అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి లేని అభివృద్ధి గత కొద్ది నెలలుగా కోహెడ గ్రామపంచాయతీ సర్పంచ్ బందెల సుజాత ఆధ్వర్యంలో కనిపిస్తుంది అని ప్రజలు తెలిపారు. గ్రామ సర్పంచిగా నా బాధ్యత నెరవేర్చుకుంటూ తాను రోజుకు 12గంటలు ప్రజలతో మమేకమై 12 వార్డుల లో ఏ సమస్యలున్న వెంటనే తీర్చడం వెనుక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోహెడ గ్రామంలో వార్డ్ మెంబర్లు ఏ పని చెప్పిన కాదనకుండా తక్షణమే వాటిని పరిష్కరించడం ఒక కోహెడ సర్పంచ్ బందెల సుజాత- బాలకిషన్ కి చెందింది. గత ప్రభుత్వంలో ఏడు సంవత్సరాల నుంచి లేని అభివృద్ధి ఇప్పుడు కనిపిస్తుందని ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విద్యావంతురాలైన కోహెడ సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్ రోజు 12గంటల వ్యవధి లో నిద్రాహారాలు మాని తనకు తోచిన వార్డులో తోచిన పనిని గ్రామ పంచాయతీ సిబ్బందితో గ్రామ సమస్యలను పరిష్కరిస్తూ 12 వార్డ్ మెంబర్లు చెప్పిన విధంగా వారి-వారి వార్డులలో వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతూ. యువ రక్తాన్ని తనంటే ఏంటో నిరూపించుకోవడం జరుగుతుందని ప్రజలు తెలిపారు.గతంలో ఏదైనా జరగొచ్చు గత ఏడు సంవత్సరాల నుంచి లేని అభివృద్ధి ఇప్పుడు కొద్ది నెలలు లో చేసి చూపిస్తున్నారని ప్రజలు కోహెడ సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్ అభినందిస్తున్నారు. తన మన అని అభిప్రాయం లేకుండా కుల మతాలకు అతిథంగా సేవ చేస్తూ ప్రజా మార్గంలో నడుస్తూ తనకు ప్రజలు కట్టిన పట్టాన్ని నిరూపిస్తూ ముందుకు సాగుతూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ఒక్క ఫోన్ కాల్ చేసి చెప్పిన వెంటనే పరిష్కారం చేస్తున్నారని ప్రజలు తెలుపుతున్నారు. ఈ లాంటి సర్పంచును గతంలో ఎన్నడూ చూడలేదని ప్రజలు సంతోషపడుతున్నారు.ఏడు సంవత్సరాల క్రితం ముగిసిన,ఐదు సంవత్సరాల అభివృద్ధి ఏమి చెందలేదని ప్రజలు వాపోతున్నారు. కొద్ది నెలలైనా అధికారం చేపట్టి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ..చెప్పిన వెంటనే తక్షణమే తన కర్తవ్యం గా తన ఇంటి సమస్యగా తీసుకొని తానున్నానంటూ ముందుకు వెళుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారని, ప్రజలు సర్పంచ్ అంటే ఇలాగే ఉండాలని చూసి నేర్చుకోవాలని ఇతర గ్రామాలకు చెందిన గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. తక్షణమే అర్ధరాత్రి అయిన అపరాత్రైన అని కాకుండా తనకు ఫోన్ కాల్ చేసిన వెంటనే కోహెడ ప్రజలకు ఐదు నిమిషాలు,పది నిమిషాల్లో అందుబాటులో ఉండి అక్కడ సమస్యను పరిష్కరించడం తన యువ రక్తాన్ని నిరూపిస్తూ ఒక యువకురాలు గా కోహెడ సర్పంచ్ అయితే ఎలా ఉంటారో అని నిరూపిస్తూ ముందుకు సాగుతూ వెళ్తున్నారు. ప్రజలు తనను సర్పంచ్ గా ఎన్నుకున్నందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ బందెల సుజాత-బాలకిషన్ ఇలాగే రాబోయే ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తానని తాను ప్రజల సమక్షంలో తెలుపుతూ ప్రజలతో అనునిత్యం ప్రజలతో మమేకమై ప్రజలలో ఒకరిగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ. తాను ఇలాగే ముందుకు సాగుతానని కేంద్రం ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను,రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను మన గ్రామపంచాయతీకి సద్వినియోగం చేస్తూ కోహెడ 12 వార్డులకు వాటిని వినియోగిస్తూ అనుక్షణం ప్రజల కోసం పనిచేస్తానని ఆమె తెలిపారు. డ్రైనేజీ సమస్యలు గానీ, ముండ్ల పొదలు తొలగించడంలో గాని తనకున్న బడ్జెట్ ను ఉపయోగించి తక్షనే పరిష్కరిస్తాన్ని ఆమె ప్రజల సమక్షంలో తెలిపారు. ప్రజలు తనను సర్పంచ్ గా ఎన్నుకున్నందుకు కోహెడ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ జిల్లా అభివృద్ధిలో అధికారులందరూ భాగస్వాములు కావాలని

జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు

సిద్దిపేట ప్రతినిధి, ఉదయం న్యూస్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.

దేశానికి ఆదర్శంగా నిలిచేలా సిద్దిపేట జిల్లాలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే గ్రామీణ, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలలో దేశ స్థాయిలో ఏ అవార్డు ప్రకటించిన సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలుస్తుందని మును ముందు కూడా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గరిష్ట స్థాయిలో విజయవంతం అయ్యేలా అధికారులు అందరూ కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ రాజ్ కుమార్, కలెక్టరేట్ మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల రవాణా విస్తృతం చేయాలి

రాయచోటి, జూన్ 02: (ఉదయం ప్రతినిధి)

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ వాణిజ్య మరియు మార్కెటింగ్ అధికారి తెలిపారు.జూలై 1, 2026 నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డుల పరిధిలో కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించే సమయంలో సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ జారీ చేయబడుతుందని పేర్కొన్నారు.ఈ విధానం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల రవాణాలో పారదర్శకత పెరగడంతో పాటు మార్కెట్ ఫీజు ఎగవేతను నివారించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఉత్పత్తుల కొనుగోలు, రవాణా ప్రక్రియపై సమగ్ర సమాచారం అందుబాటులో ఉండటంతో రైతులు, వ్యాపారులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు .వ్యాపారులు, వాలంటరీ ట్రేడర్లు, రవాణాదారులు సంబంధిత నిబంధనలకు అనుగుణంగా ఈ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ పొందిన తర్వాత మాత్రమే వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేయాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి పర్మిట్ లేకుండా సరుకులను తరలించినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.ఈ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం రైతులు, వ్యాపారులు తమ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిని సంప్రదించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మరియు మార్కెటింగ్ అధికారి సూచించారు.వ్యవసాయ ఉత్పత్తుల రవాణాపై చర్చిస్తున్న ఉన్నతాధికారులు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు

కరీంనగర్ ప్రతినిధి, ఉదయం న్యూస్

ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం కమీషనరేట్ కేంద్రంలోని క్వార్టర్స్ గార్డ్స్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయుధ బలగాల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు.అదేవిధంగా,కమిషనరేట్ పరిపాలన కార్యాలయం సిపిఓ వద్ద అడిషనల్ డీసీపీ అడ్మిన్ వెంకటరమణ జాతీయ జెండాను ఎగురవేశారు.పతాకావిష్కరణ అనంతరం పోలీస్ కమిషనర్ మరియు ఉన్నతాధికారులు సిబ్బందికి, అధికారులకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్లను పంపిణీ చేశారు.శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఈ సందర్భంగా రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ,ప్రజల రక్షణలో కరీంనగర్ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేసారు.ఈ వేడుకల్లో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, పలువురు పోలీసు ఉన్నతాధికారులు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, మినిస్ట్రీరియల్ విభాగం అధికారులు,ఆర్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణను దేశానికే ఆదర్శంగా మార్చినం: కేసీఆర్

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఒకనాడు వివక్షతో అల్లాడిన తెలంగాణను పదేళ్ల పాలనలో దేశానికే ఆదర్శంగా మార్చామని, సకల జనుల సంక్షేమం, సమగ్ర ప్రగతి సాధించి రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలిపామని కేసీఆర్ పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రస్తుత పాలకులకు ఆయన హితవు పలికారు.

వీరబ్రహ్మేంద్ర స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇ వి మహేశ్వర్ రెడ్డి

బ్రహ్మంగారిమఠం ఉదయం ప్రతినిధి



భూత, భవిష్యత్తు, వర్తమాన కాలజ్ఞాని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాములవారికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి సీనియర్ నాయకుడు కడప జిల్లా కాజీపేట కు చెందిన ఇరగమ్ రెడ్డి వెంకట మహేశ్వర్ రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవాలయం మేనేజర్ ఈశ్వరయ్య చారి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆహ్వానం పలుపుతూ బ్రహ్మంగారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రంతోపాటు, పూలమాలతో సత్కరించి స్వామివారి అక్షింతలను తలపై వేస్తూ ఆలయ ప్రధాన అర్చకులు బేస్తవారిపేట వీరబ్రహ్మం ప్రత్యేక ఆశీస్సులు అందజేశారు. అనంతరం స్వామివారి పాదాల వద్ద కూడా పూజలు నిర్వహించారు. ఈయన వెంట సూర్య దినపత్రిక ఉమ్మడి కడప జిల్లా జనరల్ మేనేజర్ బ్రహ్మానంద రెడ్డి, సీనియర్ పాత్రికేయులు చంద్ర, వరుణ్ హై స్కూల్ కరస్పాండెంట్ సీనియర్ పాత్రికేయులు ఎలిచర్ల వెంకటరమణారెడ్డి లతోపాటు ఇతర నేతలు బ్రహ్మంగారిమఠం మండల వివిధ దిన పత్రికల విలేకరులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవీ మహేశ్వర్ రెడ్డి విలేకరులతో ముచ్చటిస్తూ బ్రహ్మంగారి మఠానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నా మనీ అలాగే కడప జిల్లాతో పాటు, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని స్వామివారిని కోరుకున్నానన్నారు. అదేవిధంగా బ్రహ్మంగారిమఠం దేవస్థానం అభివృద్ధితో పాటు ఈ మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీలలో తగిన అభివృద్ధి జరిగేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. వాటి అభివృద్ధి కోసం త్వరలోనే విలేకరుల ఆధ్వర్యంలో ఓ డెవలప్మెంట్ కమిటీ పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసి ఆ కమిటీ ద్వారా కావలసిన అన్ని రకాల అభివృద్ధి పనులను సాధించేందుకు కృషి చేస్తామన్నారు దీనికోసం వీలైనంత త్వరలో మరో మారు బ్రహ్మంగారిమఠంలో పర్యటించి త్వరలోనే ఆ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసేందుకు మీతో మీ అందరి సహకారంతో పాటు ఇతర పెద్దల సహకారం తీసుకొని ఒక మంచి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధికి కావలసిన అన్ని రకాల పనులను ముందుకు తీసుకువెళ్లేందుకు తాను కృషి చేస్తానని

ఆయన పేర్కొన్నారు. ప్రసాదం స్కీం కింద నిధులను మంజూరు చేసేందుకు స్థానిక శాసనసభ్యులు ప్రయత్నం చేస్తున్నారని ఆయన దృష్టికి

తీసుకెళ్లగా అభివృద్ధి నీ అందరము ముందుండి చేయించాలని ఎటువంటి నిధులను తీసుకొచ్చిన వాటికి అభివృద్ధి కమిటీ తరఫున ముందుండి చేయూతనందిస్తామని ఆయనకితావించారు. త్వరలోనే ఈ అభివృద్ధి కమిటీకి సంబంధించి ఒక రూపకల్పన కు తాను ముందుండి కసరత్తు చేస్తానన్నారు.

హార్ట్‌బీట్ తేడా కొడుతుందా?



క్రమరహిత హృదయ స్పందన దీన్నే అరిథ్మియా అని కూడా పిలుస్తుంటారు. గుండె చాలా వేగంగా కొట్టుకోవడం, చాలా నెమ్మదిగా లేదా క్రమరహిత నమూనాలో కొట్టుకునే స్థితిని సూచిస్తుంది. హృదయ స్పందన రేటు, లయను నియంత్రించే గుండె విద్యుత్ వ్యవస్థలో భంగం ఏర్పడినప్పుడు ఇది సంభవిస్తుంది. హార్ట్‌బీట్‌లో అప్పుడప్పుడూ తేడాలు కనిపిస్తే సాధారణ విషయమే.. ఇది అంతగా ప్రమాదం ఉండదు. హృదయ స్పందనలో తరచుగా తేడాలు గుర్తిస్తే.. . గుండె సమస్యలు, అధిక రక్తపోటు, ఒత్తిడి, స్మోకింగ్, ఆల్కహాల్, కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం, డ్రగ్స్ వినియోగం, జన్యుపరమైన రుగ్మతలు, హార్మోన్ల మార్పులు వంటి కొన్ని అంశాలు క్రమరహిత గుండె లయలకు కారణాలు.

హార్ట్‌బీట్‌లో తేడాకు గల కారణాలను గుర్తిస్తే.. ఈ సమస్యను పరిష్కరించడం సాధ్యమవుతుంది. కొన్ని లైఫ్‌స్టైల్ మార్పులు.. గుండె సక్రమంగా కొట్టుకునేలా తోడ్పడతాయి. మీ హార్ట్‌బీట్‌లో తేడాలు ఉంటే..

రోజుకు కనీసం 30 నిమిషాల పాటు తక్కువ స్థాయి వ్యాయామాలు చేస్తే.. గుండె పనితీరు మెరుగుపడుతుంది. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే.. గుండె సక్రమంగా కొట్టుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. ఏరోబిక్ వ్యాయామాలు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయని అంటున్నారు. మీ డైట్‌లో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన సమతుల్య ఆహారం తీసుకుంటే.. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇది క్రమరహిత హృదయ స్పందనను తగ్గిస్తుంది. పోషకాహారం మీ గుండె ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. ప్రాసెస్డ్ ఫుడ్, వేయించిన ఆహారం, జంక్ ఫుడ్ మీ గుండె ఆరోగ్యాన్ని మరింత దిగజార్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఆహారాలు.. గుండె సమస్యల ముప్పును పెంచుతాయి.

ఒత్తిడి తగ్గించుకోండి.. ఒత్తిడి కారణంగా.. గుండె లయలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. ఒత్తిడి స్థాయిలను తగ్గించుకుంటే.. గుండె సక్రమంగా కొట్టుకుంటుంది. ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు, యోగా , సంగీతం వినండి, నచ్చిన వ్యక్తులతో సమయం గడపండి.

ట్రిగ్గర్స్‌కు దూరంగా ఉండండి.. కెఫిన్, నికోటిన్, ఆల్కహాల్ వంటివి క్రమరహిత హృదయ స్పందనను ట్రిగ్గర్ చేస్తాయి. ఆల్కహాల్, కెఫిన్ ఎక్కువగా తీసుకుంటే.. గుండె లయలో తేడాలు తీవ్రమవుతాయి. మీ గుండె సక్రమంగా ఉండాలంటే.. ఈ అలవాట్లకు దూరంగా ఉండండి.

బరువును కంట్రోల్‌లో ఉంచుకోండి.. బరువును కంట్రోల్‌లో ఉంచుకుంటే.. గుండెపై ఒత్తిడిని తగ్గించుకోవచ్చు, క్రమరహిత హృదయ స్పందనను నిరోధించవచ్చు. అధిక బరువు డయాబెటిస్, కొలెస్ట్రాల్, గుండె లయలో తేడాల ముప్పును పెంచుతుంది.

ప్రశాంతంగా నిద్ర పోండి.. నిద్ర లేమి గుండె లయ అసాధారణతలకు దోహదపడుతుంది. రోజూ రాత్రి 7 నుంచి 8 గంటలు ప్రశాంతంగా నిద్ర పోండి. ప్రశాంతమైన నిద్ర గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రోజంతా తగినంత మొత్తంలో నీరు తాగడం వల్ల ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవచ్చు. రోజూ కనీసం 2-3 లీటర్ల నీరు తాగడానికి ట్రై చేయండి.

జుట్టు పొడిబారిందా..

శీతాకాలం చాలామంది ఎదుర్కొనే సమస్య.. పొడిజుట్టు. చలికాలంలో ఉండే చలిగాలుల ప్రభావం మాత్రమే కాకుండా వాతావరణంలో ఉండే తేమ, పొగమంచు.. వంటి వాటి వల్ల కూడా జుట్టు పొడిబారుతుంది. దాంతో జుట్టు నిర్జీవంగా మారడం, చివర్ల చిట్లిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. సహజసిద్ధంగానే పొడితత్వం ఉండే జుట్టు ఉన్నవారు.. మరిన్ని సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. చలికాలంలో కొన్ని న్యాచురల్ ప్యాక్స్‌తో మీ జుట్టును మృదువుగా, పట్టులా ఉంచుకోవచ్చు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

అరటిపండుతో.. మీ జుట్టు పొడిబారితే.. బాగా పండిన ఒక అరటిపండు తీసుకొని దానిని మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. అందులో రెండు చెంచాల ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ పేస్ట్‌ను జుట్టుకు అప్లై చేసి 20 నుంచి 30 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత షాంపూతో శుభ్రం చేసుకొని కండిషనర్ రాసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. పట్టులాంటి జుట్టు మీ సొంతం అవుతుంది.

గుడ్డుతో.. గుడ్డులోని తెల్ల సొనకు రెండు చెంచాల చొప్పున శనగపిండి, బాదం పొడి, తగినంత గులాబీనీరు కలిపి మెత్తని పేస్టులా చేసుకోవాలి. దీన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి అరగంట ఆగి, గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. జుట్టు ఆరోగ్యంగా, మృదువుగా ఉంటుంది.

గుమ్మడికాయతో.. గుమ్మడికాయ మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతగానో తోడ్పడుతుంది. గుమ్మడికాయలోని విటమిన్ ఎ, సిలతో పాటు బీటాకెరోటిన్, జింక్, పొటాషియం మీ జుట్టును హెల్తీగా ఉంచుతాయి. కొద్దిగా గుమ్మడికాయ పేస్ట్ తీసుకొని అందులో రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేసి 10 నుంచి 15 నిమిషాలు ఆరనివ్వాలి. ఆ తర్వాత తలస్నానం చేసి మంచి కండిషనర్ అప్లై చేసుకోవాలి. ఈ ప్యాక్ ద్వారా కురులు మృదువుగా, పట్టులా మారతాయి.



మెంతి ప్యాక్.. జుట్టు పొడిబారకుండా... రెండు చెంచాల మెంతిపిండికి నాలుగు చెంచాల కొబ్బరిపాలను కలిపి మెత్తని పేస్టులా చేసుకోవాలి. దీన్ని మాడుకి పట్టించి మృదువుగా మర్దనా చేయాలి. గంట తర్వాత గాఢత తక్కువున్న షాంపూతో తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. మృదువైన జుట్టు మీ సొంతం అవుతుంది.

గంజితో.. గంజిలో బి, ఇ, సి విటమిన్లు ఉంటాయి. ఇవి వెంట్రుకలకు పోషణనిచ్చి ఆరోగ్యంగా మారుస్తాయి. గంజికి కాస్త మజ్జిగ కలిపి తలకు పట్టించి అరగంట ఆరనివ్వండి. ఆపై తక్కువ గాఢత గల షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే కుదుళ్లు బలపడతాయి. ఇందులో ఉండే అమైనో ఆమ్లాలు... జుట్టుకి పోషణ అందించి నిగారింపుతో కనిపించేలా చేస్తాయి.

బరువు తగ్గడానికి ట్రై చేస్తున్నారా..? అయితే ఈ స్నాక్స్ ఆప్షన్స్ మీ కోసమే

మెడిటేరియన్ డైట్ పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ళు, తృణధాన్యాలు, గింజలు, నట్స్ వంటి మొక్కల ఆధారిత ఆహారం తీసుకోవాలని చెబుతోంది. అదనంగా, చేపలు, పౌల్ట్రీ, పాల ఉత్పత్తులు, రెడ్‌వైన్ మితంగా తీసుకోవాలని అంటున్నారు. సంతృప్త కొవ్వులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర పానీయాలకు దూరంగా ఉండాలని చెబుతోంది. మెడిటేరియన్ డైట్ ఫాలో అయితే.. బరువు తగ్గడమే కాదు, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, గుండె సమస్యలు వంటి తీవ్రమైన అనారోగ్యాల ముప్పు కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. మీరు బరువు తగ్గడానికి మెడిటరేనియన్ డైట్ ఫాలో అవుతుంటే.. ఎలాంటి స్నాక్స్ తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.

ఆలివ్స్.. మీరు మెడిటేరియన్ డైట్ ఫాలో అవుతుంటే.. ఆలివ్స్‌ను స్నాక్స్‌గా తీసుకోవచ్చు. ఆలివ్స్‌లో ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి మిమ్మల్ని నిండుగా ఉంచుతాయి. ఆలివ్స్‌లో గుండె ఆరోగ్యానికి తోడ్పడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.

గ్రీక్ యోగర్ట్.. గ్రీక్ యోగర్ట్‌లో ప్రొటీన్, కాల్షియం అధికంగా ఉంటాయి. ఈ పోషకాలు మీ కడుపును నిండుగా ఉంచుతాయి, అతిగా తినకుండా నిరోధిస్తాయి. తద్వారా మీ బరువు కంట్రోల్‌లో ఉంటుంది. గ్రీక్ యోగర్ట్‌లో కాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను బలంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే, లో ఫ్యాట్ గ్రీక్ యోగర్ట్ తీసుకోండి. దాని రుచి, పోషకాలను రెట్టింపు చేయడానికి పండ్లు, నట్స్ యాడ్ చేసుకోండి.

హమ్మస్.. బాదం, వాల్‌నట్‌లు, పిస్తాలు హెల్తీ స్నాక్స్‌కు బెస్ట్ ఆప్షన్స్. వీటిలో గుండె ఆరోగ్యానికి మేలు చేసే కొవ్వులు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. నట్స్ మీరు బరువు తగ్గడానికీ తోడ్పడతాయి. అయితే, నట్స్‌లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. ఇవి మితంగా తీసుకోవడమే మేలు.

మెడిటరేనియన్ డైట్ యాపిల్స్, నారింజ, బెర్రీలు, ద్రాక్ష వంటి పండ్లు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఫైబర్, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. మీరు స్నాక్స్‌గా తాజా పండ్లను తీసుకోండి. డార్క్ చాక్లెట్.. డార్క్ చాక్లెట్‌లో 70% కోకో కంటెంట్ ఉంటుంది. ఇది బెస్ట్ స్నాక్ అని చెప్పొచ్చు. డార్క్ చాక్లెట్‌లో అధికంగా ఉండే.. యాంటాఆక్సిడెంట్లు గుండె, హృదయనాళ ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

క్రిస్మస్‌కి ఈ స్వీట్స్ చేస్తే ఇంటిల్లిపాది ఎంజాయ్ చేస్తారు..

క్రిస్మస్ వేడుకలకి నెల రోజుల ముందు స్వీట్స్ చేసుకుంటారు. క్రిస్మస్ కోసం ఇంట్లో ఎన్నో స్వీట్స్ తయారు చేస్తారు. మరికొందరు బయటి నుంచి తెచ్చుకుంటున్నారు. క్రిస్మస్ సందర్భంగా ఇలాంటి కేక్స్‌ని ఇష్టంగా తింటారు. మరి అలాంటి కేక్స్‌ని ఇంట్లోనే ఎలా తయారు చేయాలో చూద్దాం.

గులాబీ రేకులు.. వీటిని ఎక్కువగా కేరళలో చేస్తారు. అయితే, మన దగ్గర కూడా వీటిని చాలా మంది ఇష్టంగా చేసుకుని తింటారు. పిండి, చక్కెర, గుడ్లు, కొబ్బరిపాలతో తయారు చేసి నూనెలో డీప్ ఫ్రై చేస్తారు. ఇవి చూడ్డానికి పూరేకుల్లా ఉంటాయి. కాబట్టి, వీటికి ఈ పేరు వచ్చింది.

కజ్జికాయలు.. చూడగానే చాలా మందికి నోరూరుతుంటుంది. ఇవి కూడా క్రిస్మస్ స్వీట్స్‌ల్లో ఒకటి. వీటిని చక్కగా కొబ్బరి, జీడిపప్పు, సెమోలినా, ఎండుద్రాక్షలతో చేస్తారు. బయట క్రిస్పీగా లోపల టేస్టీగా భలే ఉంటాయి. వీటిని హ్యాపీగా తినొచ్చు. వీటిని కర్ణాటక కుస్వార్, గోవాలోని కన్సోడాల్లో ఎక్కువగా చేసుకుని తింటారు.

గవ్వలు.. వీటిని కూడా మంది చేస్తారు. చక్కని స్నాక్స్ అని చెప్పొచ్చు. ఇవి పిల్లలు ఎక్కువగా తింటారు. పిండిని ముద్దని సముద్రపు గవ్వల్లా వీటిని చేసి పాకంలో వేస్తారు. వీటితో కావాలంటే కారం గవ్వలు కూడా చేయొచ్చు. వీటిని ఎక్కువగా గోవా, మహారాష్ట్రలో చేస్తారు.

ప్లమ్ కేక్.. క్రిస్మస్ కేక్స్ అనగానే ప్లమ్ కేక్ చాలా స్పెషల్. ఇది డ్రై ఫ్రూట్స్, నట్స్‌ని ఆల్కహాల్‌లో నానబెట్టిన దానిలో పిండి కలిపి చేస్తారు. ఇది ఎంతో టేస్టీగా ఉంటుంది. ఇది ఇంట్లోనే చేసుకోవచ్చు. లేదా బేకరీల్లో నుంచి తెచ్చుకుని చేయొచ్చు.

ప్రమాదవశాత్తు మరణించిన విశ్వబ్రాహ్మణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కర్నూల్ ఉదయం

మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వెళ్లి స్నానానికి తుంగభద్రా నదికి వెళ్ళగా ఆ భక్తులు నీటి వరవడిలో చిక్కుకొనిచనిపోయారు. ఐదుగురు ఏకకాలంలో ఐదు కుటుంబాలవిశ్వబ్రాహ్మణులు మరణించడం విచారించదగ్గ విషయం. కుటుంబానికి వీరే పెద్దదిక్కు .కావున రాష్ట్ర ప్రభుత్వం విష్ యు బ్రాహ్మణులపై మక్కువతో ఈ కుటుంబాలను ఆదుకోవాలని ప్రముఖ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ నాయకుడు దేవాపూజ ధనుంజయ చారి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు.మృతి చెందిన ఐదుగురి కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆపద్బాంధవు పథకం కింద ఒక్కొక్కరికి ఐదు లక్షలు మంజూరు చేయాలని, వీటితోపాటు ప్రతి కుటుంబంలో ఒకరికి ఔట్సోర్సింగ్ లో ఉద్యోగా అవకాశం కల్పించాలని భారతీయ విశ్వకర్మ పంచమండలి అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విన్నవించుకున్నారు వీరితోపాటు పలువురు విశ్వబ్రాహ్మణులు కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ద్వారా అర్జీని అందజేశారు.

జర్నలిస్టుల హక్కుల కోసం ఉద్యమించాలి... APWJF జిల్లా నాయకులు టి.జి.ప్రసాద్

కర్నూలు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కోడుమూరు నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర, జిల్లా నాయకులు జి. గోరంట్లప్పా, టి జి. ప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్ట్ వృత్తి పరంగా ఎన్నో కష్టాలు పడుతున్నారని రాష్ట్రంలో అనేక చోట్ల దాడులు, హత్యలు పెరిపోతున్నాయని జర్నలిస్ట్ లకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.జర్నలిస్టుకు పింఛను సౌకర్యం కల్పించాలని అలాగే జర్నలిస్ట్ ల పిల్లలకు ప్రేవేట్ విద్య సంస్థల్లో ఉచిత విద్యను అందించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని అలాగే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి సీనియర్ జర్నలిస్ట్ ఇంతియాజ్ బాషా అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు చంద్రమోహన్, శివ పాల్గొన్నారు. అనంతరం కోడుమూరు ఏపీడబ్ల్యూజేఎఫ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కోడుమూరు నియోజకవర్గం ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక గౌరవ అధ్యక్షుడిగా ఇంతియాజ్‌బాషా,అధ్యక్షుడిగా టి.రఘు (ఈజ)ప్రధాన కార్యదర్శిగా హంపిరెడ్డి (సాక్షి)ఉపాధ్యక్షుడిగా వెంకట్ (ప్రజాశక్తి),సహాయ కార్యదర్శిగా జి.నాగరాజు (10టీవీ),కోశాధికారిగా సి.గణేష్ (హెచ్ఎంటీవీ), సభ్యులుగా యుగంధర్ (సాక్షి టీవీ),ఎస్.గిరిబాబు (ఐ న్యూస్)బి.వీరన్న (సుమన్ టీవీ),సి.శివ (99టీవీ)లక్ష్మన్న (ప్రజాశక్తి) లను ఎన్నుకున్నారు

మే నెల యూపీఐ లావాదేవీల్లో సరికొత్త రికార్డు

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీల్లో సరికొత్త రికార్డు నమోదైంది. ఈ ఏడాది మే నెలలో రూ.29.90 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. సంఖ్యా పరంగా 2,320 కోట్ల లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. వేసవి ప్రయాణాలకు ఐపీఎల్ సీజన్ తోడవ్వడం యూపీఐ లావాదేవీలు పెరగడానికి కారణమయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.29.03 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరగ్గా.. గతేడాది మే నెలలో రూ.25.14 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగాయి. ఏడాదిలో 19 శాతం వృద్ధి నమోదైందని ఎన్‌పీసీఐ తెలిపింది. గతేడాది ఇదే సమయంలో 1867 కోట్లుగా ఉన్న లావాదేవీల సంఖ్య ఏకంగా 24 శాతం వృద్ధితో 2320 కోట్లకు చేరి సరికొత్త రికార్డు నమోదైందని పేర్కొంది. వేసవి సెలవుల్లో ప్రయాణాలు, ఐపీఎల్ ఫీవర్, సీజన్ పరంగా జరిగే లావాదేవీల కారణంగా ఈ స్థాయిలో యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయని క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆకాశ్ సిన్హా పేర్కొన్నారు. ఇది నెలవారీ యూపీఐ లావాదేవీల వృద్ధిని సూచిస్తోందని తెలిపారు. 2021లో యూపీఐ సగటు లావాదేవీ మొత్తం (టికెట్ సైజ్) రూ.1848గా ఉండగా.. 2025 నాటికి రూ.1313కు తగ్గినట్లు ఆర్‌బీఐ నివేదిక ఇటీవల వెల్లడించింది. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,

యూపీఐ ఎకోసిస్టమ్ బలోపేతం అవుతుందనడానికి సంకేతమని ఆకాశ్ సిన్హా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జీ నెట్‌వర్క్‌కు భారత్‌లో ఫిఫా ప్రసార హక్కులు

భారత ఫుట్‌బాల్ అభిమానులకు శుభవార్త. 2026 ఫిఫా వరల్డ్ కప్ ప్రసార హక్కులను జీ నెట్‌వర్క్ సోమవారం సొంతం చేసుకుంది. వినిమయేతర కాలానికి అంటే.. 2034 వరకు ఆ మీడియా సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల్లో జూన్ 11 నుంచి ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. దానికి కేవలం 10 రోజుల ముందు ఈ ఒప్పందం కుదిరింది. ఈ డీల్ ద్వారా 2034 వరకు 38 ఫిఫా ఈవెంట్ల ప్రసార హక్కులు జీ నెట్‌వర్క్‌కు లభించనున్నాయి. అయితే ఈ ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలను వెల్లడించలేదు. 2026, 2030 ప్రపంచకప్‌లను కవర్ చేసే ఇండియా ప్యాకేజీ కోసం ఫిఫా మొదట సుమారు 100 మిలియన్ డాలర్లను కోరింది. తర్వాత ఆ మొత్తాన్ని 60 మిలియన్ డాలర్లకు తగ్గించిందని గతంలో వార్తలు వచ్చాయి. భారతదేశంలోని ప్రముఖ క్రీడా ప్రసార సంస్థ జియోస్టార్ ఈ హక్కుల కోసం సుమారు 20 మిలియన్ డాలర్లను ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ఫిఫా ఈ బిడ్‌ను తిరస్కరించింది. సోనీ సంస్థ కూడా ఈ హక్కుల ప్యాకేజీపై చర్చలు జరిపింది. కానీ చివరికి అది బిడ్ సమర్పించలేదు.

ఈ ఐపీఎల్ సీజన్‌లో వైభవ్ ఆదాయం తెలుసా?

పదిహేనేళ్ల టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ ఐపీఎల్ సీజన్‌లో అత్యధికంగా 776 పరుగులు చేసి, ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. అలాగే 72 సిక్సర్లతో అభిమానులను అలరించి పలు అవార్డులను అందుకున్నాడు. మరి ఈ చిచ్చర పిడుగు తాజా ఐపీఎల్ సీజన్‌లో ఎంత డబ్బును తన జేబులో వేసుకున్నాడో తెలుసా..! వైభవ్ సూర్యవంశీని రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీ రూ.1.10 కోట్లకు వేలంపాటలో దక్కించుకుంది. ఈ మొత్తంతో పాటు మ్యాచ్ ఫీజులు, పలు రివార్డులూ అతడు సొంతం చేసుకున్నాడు. మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా రూ.15 లక్షలు, టోర్నమెంట్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నందుకు గాను రూ.10 లక్షలు, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచినందుకు రూ.10 లక్షలతో పాటు టాటా సియెరా వాహనం, సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచినందుకు రూ.10 లక్షలు, అలాగే ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డ్ సొంతం చేసుకున్నందుకు రూ.10 లక్షలు అందుకున్నాడు. అలాగే అతడి ఒక మ్యాచ్ ఫీజు రూ.7.5 లక్షలు. వైభవ్ ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌లు ఆడాడు. ఇలా అతను రూ.1.20 కోట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ఎలక్ట్రిక్ స్ట్రైకర్ ఆఫ్ ది మ్యాచ్, మోస్ట్ సిక్సెస్ ఆఫ్ ది మ్యాచ్ రివార్డుల ద్వారా మరికొంత నజరానా పొందాడు. ఇలా మొత్తంగా వైభవ్ సూర్యవంశీ రూ.2.85 కోట్లకు పైగా ఎట్టకు మొత్తాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.

కప్పు కొట్టినా నో సెలబ్రేషన్స్

ఐపీఎల్ 2026 విజేతగా నిలిచినప్పటికీ, ఆర్సీబీ ఈసారి బెంగళూరులో ఎలాంటి విజయోత్సవ ర్యాలీ నిర్వహించకూడదని నిర్ణయించినట్లు సమాచారం. గత సీజన్ ర్యాలీలో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బెంగళూరు పోలీసులు.. అభిమానుల సెలబ్రేషన్స్‌పై ఆంక్షలు విధించారు. దానికి తోడు విదేశీ ఆటగాళ్లు వారి వారి దేశాలకు వెళ్లాల్సి ఉండటం, భారత్-అఫ్గానిస్థాన్ టెస్ట్ ప్రారంభం కానుండటం కూడా విజయోత్సవ ర్యాలీ చేయకపోవడానికి కారణమయ్యాయి!డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఐపీఎల్ 2026 బరిలోకి దిగిన ఆర్సీబీ.. వరుసగా రెండో ఐపీఎల్ టైటిల్ సాధించింది.

ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ క్రికెట్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్ పోరులో గెలిచి విజేతగా నిలిచింది. అయితే గత సీజన్ విజయం తర్వాత ఆర్సీబీ బెంగళూరులో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ విషాదంగా మారింది. లక్షలాది మంది అభిమానులు చిన్నస్వామి స్టేడియానికి పోటెత్తడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాంటి విజయోత్సవ ర్యాలీ నిర్వహించకూడదని ఆర్సీబీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పరిస్థితుల్లో బెంగళూరులో విజయోత్సవ ర్యాలీ, సెలబ్రేషన్స్ నిర్వహించే ఉద్దేశం ఆర్సీబీకి లేదని సమాచారం. "గత ఏడాది జరిగిన పరిణామాల దృష్ట్యా బెంగళూరులో ప్రస్తుతం కొన్ని మార్గదర్శకాలు అమలులో ఉన్నాయి. మనమంతా వాటికి కట్టుబడి ఉండాల్సి ఉంటుంది. అందుకే ఈసారి ఎలాంటి విజయోత్సవ కార్యక్రమాలు, సంబరాలు నిర్వహించడం లేదు" అని ఆర్సీబీ వర్గాలు చెప్పినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఆర్సీబీ ఐపీఎల్ 2026 టైటిల్ గెలిచిన నేపథ్యంలో బెంగళూరు పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. అభిమానులు బెంగళూరులో రోడ్ల మీద గుమిగూడకూడదని, సంబరాల్లో భాగంగా బాణసంచా కాల్చకూడదని, ప్రజాజీవనానికి ఏ విధమైన ఆటంకమూ కలిగించరాదని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదని, బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహించుకోవడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా సంబరాలు నిర్వహించుకోవాలనుకుంటే.. ఇళ్లలోనే చేసుకోవాలని సూచించారు. మరోవైపు విజయోత్సవాల్లో పాల్గొనేందుకు అంతర్జాతీయ ఆటగాళ్లు ఉండటం కూడా కష్టమే. ఎందుకంటే త్వరలో జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్, జాకబ్ డఫీ, రొమారియో షెఫర్డ్ తదితర అంతర్జాతీయ ఆటగాళ్లు తమ తమ జాతీయ జట్లలో చేరాల్సి ఉంది. దానికి తోడు ఈ వారంలోనే భారత్, అఫ్గానిస్థాన్ టెస్ట్ మ్యాచ్ కూడా జరగనుంది. దేవదత్ పడిక్కల్ ఇందుకోసం భారత జట్టులో చేరనున్నాడు. ఈ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. విజయోత్సవ ర్యాలీ చేపట్టకూడదని నిర్ణయించింది!

గుజరాత్ టైటాన్స్ జట్టుకు త్రుటిలో తప్పిన ప్రమాదం..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన గుజరాత్ టైటాన్స్ జట్టుకు కొద్దిసేపటికే ఒక ఊహించని ప్రమాదం ఎదురైంది. ఆదివారం రాత్రి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం నుంచి మ్యాచ్ ముగించుకుని ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ హోటల్‌కు తిరిగి వెళుతుండగా వారి టీమ్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బస్సులో షార్ట్ సర్క్యూట్ సంభవించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అయితే, అప్రమత్తమైన సిబ్బంది ఆటగాళ్లందరినీ వెంటనే సురక్షితంగా కిందకు దింపేయడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో షార్ట్ సర్క్యూట్ అవ్వడం వల్ల క్షణాల వ్యవధిలోనే లోపల దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది వాహనం నుండి కిందకు దిగి ప్రాణాలు దక్కించుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రత్యామ్నాయ బస్సు అందుబాటులో లేకపోవడంతో శుభమాన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు దాదాపు గంటపాటు రోడ్డుపైనే వేచి చూడాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్రాంఛైజీ యాజమాన్యం వేరే బస్సును ఏర్పాటు చేయడంతో అందరూ సురక్షితంగా హోటల్‌కు చేరుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, అందరూ క్షేమంగా ఉన్నారని అధికారులు ధృవీకరించారు. ఐపీఎల్ 2026 ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో గుజరాత్ టైటాన్స్ 5 వికెట్ల తేడాతో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ కేవలం 155/8 పరుగులకే పరిమితమవ్వగా.. ఆర్సీబీ ఆ లక్ష్యాన్ని ఛేదించి వరుసగా రెండో ఏడాది కూడా

ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో ఓటమి బాధలో ఉన్న టైటాన్స్ జట్టుకు, ఈ బస్సు ప్రమాదం మరింత ఆందోళన కలిగించింది. గత కొద్దిరోజులుగా గుజరాత్ టైటాన్స్ జట్టుకు ప్రయాణ షెడ్యూల్ చాలా భారంగా మారింది. మే 26న ధర్మశాలలో ఆర్సీబీతో క్వాలిఫైయర్-1 ఆడిన జట్టు, ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్‌తో క్వాలిఫైయర్-2 ఆడేందుకు మే 27న ముల్లాన్‌పూర్‌కు ప్రయాణమైంది. అక్కడ మే 29న మ్యాచ్ ముగిశాక, మే 30న అహ్మదాబాద్ బయలుదేరాల్సి ఉండగా.. ప్రతికూల వాతావరణం వల్ల వారి చార్టర్డ్ ఫ్లైట్ దాదాపు మూడు గంటలు ఆలస్యమైంది. దీనివల్ల చివరాకు అర్ధరాత్రి మాత్రమే వారు అహ్మదాబాద్ చేరుకోగలిగారు. ఈ విపరీతమైన అలసట వల్లే ఫైనల్‌లో జట్టు ఘోరంగా విఫలమైందా? అని మ్యాచ్ అనంతరం విలేకరులు ప్రశ్నించగా.. గుజరాత్ టైటాన్స్ క్రికెట్ డైరెక్టర్ విక్రమ్ సోలంకి ఆ వాదాన్ని పెద్దగా పరిగణించకుండా నిరాకరించారు.

విమానయాన సంస్థలకు ఊరట..

జెట్ ఫ్యూయల్ ధర 27% తగ్గింపు

న్యూఢిల్లీ: విమానయాన సంస్థలకు ఊరట కల్పిస్తూ ప్రభుత్వరంగ చమురు కంపెనీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. అంతర్జాతీయ విమానాల జెట్ ఇంధన ధరలను 27 శాతం తగ్గించాయి. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరల కారణంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న విమానయాన సంస్థలకు రక్షణ కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. దేశీయ విమాన ఇంధన ధరల్లో మాత్రం వరుసగా రెండో నెలా ఎలాంటి మార్పూ చేయలేదు. జూన్ నెలకు గాను అంతర్జాతీయ విమానాల జెట్ ఇంధన ధరను కిలోలీటరుకు సుమారు 400 డాలర్ల మేర చమురు సంస్థలు తగ్గించాయి. దీంతో కిలోలీటర్ 1100 డాలర్లకు చేరింది. ఈ తగ్గింపుతో అంతర్జాతీయ విమానాల ఇంధన ధరలు, దేశీయ విమాన ఇంధన ధరలు దాదాపు సమాన స్థాయికి చేరాయి. అంతర్జాతీయ విమాన ఇంధన ధర కిలో లీటరుకు రూ.1,05,000గా ఉండగా.. ప్రస్తుతం ఢిల్లీలో దేశీయ విమాన ఇంధన ధర కిలోలీటరుకు రూ.1,04,927గా ఉంది. అంతకుముందు దేశీయ విమానాలకు ఏప్రిల్ 1న కిలోలీటరుకు 25 శాతం అంటే రూ.15వేలు చొప్పున పెంచగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల ఏటీఎఫ్ ధరలు మాత్రం రూ.73 వేలు పెంచారు. మే నెలలో అంతర్జాతీయ విమానాలకు ఏటీఎఫ్ ధరను కిలో లీటరుకు 76 డాలర్లు పెంచి 1511 డాలర్లకు చేర్చారు. దేశీయ విమానాల ధరల్లో అప్పుడు ఏ మార్పూ చేయలేదు. జూన్‌లో మాత్రం కిలో లీటరుకు 400 డాలర్లు తగ్గించడం గమనార్హం.

విమాన సంస్థలకు పెద్ద ఊరట

సాధారణంగా ఎయిర్‌లైన్స్ నిర్వహణ వ్యయంలో జెట్ ఫ్యూయల్‌కే 40 శాతం ఖర్చవుతుంది. ఇటీవలి పరిస్థితుల కారణంగా ఇది 55-60 శాతానికి పెరిగింది. పెరిగిన చమురు ధరలకు తోడు, పశ్చిమాసియా యుద్ధ వాతావరణం వల్ల విమానాలు సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ప్రముఖ విమానయాన సంస్థలు టికెట్ ధరపై సర్‌ఛార్జి విధించడం ప్రారంభించాయి. ఈ క్రమంలోనే ఎయిరిండియా జూన్-ఆగస్టు మధ్య తన అంతర్జాతీయ విమాన సర్వీసులను 27 శాతం మేర తగ్గించింది. ఏటీఎఫ్ తగ్గింపు నిర్ణయం ఆయా సంస్థలకు ఊరట కలగనుంది.

ఆరంభ లాభాలు ఆవిరి..

508 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ట్రేడైన సూచీలు.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు నష్టపోయాయి. పశ్చిమాసియాలోని శాంతిపై అనిశ్చితి నెలకొనడం, ఎఫ్‌ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, మీడియా బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 75,203.02 (క్రితం ముగింపు 74,775.74) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,367.93 వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. చివరికి 508.40 పాయింట్ల నష్టంతో 74,267.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 165.15 పాయింట్ల నష్టంతో 23,382.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, ఇండిగో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.01 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,496 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

మే నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లు

దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్ల వివరాలను సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. మే నెలలో రూ.1.94 లక్షల కోట్ల రాబడి నమోదైంది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్లలో 3.2 శాతం వృద్ధి కనిపించింది. ఇక రీఫండ్ల సర్దుబాటు అనంతరం మే నెలకు నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1,66,904 కోట్లుగా ఉన్నాయి. మొత్తంగా రీఫండ్లు 2.6 శాతం పెరిగి, రూ.27,281కోట్లుగా ఉన్నాయి. దేశీయ రీఫండ్లు 4.3 శాతం తగ్గగా.. ఎగుమతి ఆధారిత రీఫండ్లు 16.6 శాతం పెరిగాయి. గతేడాదితో పోలిస్తే.. స్థూల దేశీయ జీఎస్టీ రాబడి 2.6 శాతం తగ్గింది. ఇది మొత్తం రూ.1.34 లక్షల కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వసూళ్లు 19.1 శాతం పెరిగి, రూ.59,654 కోట్లుగా ఉన్నాయి. కాగా.. ఏప్రిల్, మే నెలల్లో జీఎస్టీ వసూళ్లు 6.2 శాతం పెరిగి, 4.37 లక్షలకోట్లకు చేరాయి.

వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ.. దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది అందాల తార ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ'తో అలరించిన ఈమె.. ఈ ఏడాది 'మేడ్ ఇన్ కొరియా'తో ప్రశంసలు దక్కించుకుంది. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హీరో శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అరసన్'. వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేసే పనిలో

అరసన్‌లో ప్రియాంక అరుల్ మోహన్

పడిందట చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని ప్రియాంక సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'తో పాటు కవిన్ సరసన మరో చిత్రంలో నాయికగా బిజీగా ఉంది.

పాలాచ్చిలో చిరు మూవీ షూటింగ్

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు బాబీ కలయికలో ఓ సినిమా రూపొందుతోంది. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత వీళ్లిద్దరి నుంచి రానున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుందని తెలిసింది. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో చిరుపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇది మాస్ అంశాలతో నిండిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. దీంట్లో చిరంజీవి పాత్ర రెండు కోణాల్లో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

నగరంలోని విమల్ థియేటర్ వద్ద కొంత షూట్ కోసం యత్నాలు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'స్పిరిట్' ఒకటి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రల్లో ఒకటిగా భావిస్తున్న ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సినిమా తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ విమల్ థియేటర్‌ను ఎంపిక చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ థియేటర్ నగరంలోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు సాక్ష్యంగా నిలిచిన ఈ థియేటర్ ఇప్పుడు 'స్పిరిట్' షూటింగ్‌కు వేదికగా మారింది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కూడా ఈ షూట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఆయన థియేటర్‌కు రానున్నారనే వార్త బయటకు రావడంతో అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. షూటింగ్ ప్రదేశం చుట్టూ అభిమానుల రద్దీ పెరగడంతో చిత్ర యూనిట్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల సహకారంతో జనసందోహాన్ని నియంత్రించే చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 'స్పిరిట్' చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, క్రైమ్ డ్రామా అంశాల కలయికతో ఈ కథ రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి నటిస్తోంది. 'యానిమల్' తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆమె నటిస్తున్న మరో చిత్రం కావడం విశేషం. మరోవైపు ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు టాలీవుడ్‌లో పూర్తి స్థాయి తొలి భారీ ప్రాజెక్ట్‌గా చెప్పుకోవచ్చు. అలాగే కాంచన, ఐశ్వర్య దేశాయ్ తదితరులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.

వ్యక్తిత్వ హననం చేసే ట్రోల్స్

ట్రోల్ చేస్తున్న వారిపై మాధురి మండిపాటు

సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్న వారిపై మండిపడ్డారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్. ఆమె, కథానాయిక త్రిప్తి దిమ్రి, ధర్ణ దుర్గా ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మా బెహెన్'. ఈ నెల 5న ఓటీటీ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలోనే మాధురి, త్రిప్తి ఓ ఇంటర్వ్యూలో సామాజిక మాధ్యమాల్లో నటీమణులపై వస్తున్న ట్రోల్స్ గురించి తమ వ్యక్తిగత అభిప్రాయాల్ని పంచుకున్నారు.

ఐశ్వర్య 20 ఏళ్లుగా కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవుతున్నారు. దేశం మొత్తానికి గర్వ కారణంగా నిలిచిన వ్యక్తి ఆమె. అలాంటి ఆమెను దుస్తులు, ఆకృతి లాంటి ఇతరత్రా వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకుని మరి వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా చేసి ఆమె స్థాయిని తగ్గించలేరు. అలాంటి వ్యక్తులపై ట్రోల్స్ చేసేవారు నేటి యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో గ్రహించాలని అనుకుంటున్నాను. మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశం ఇస్తున్నారా? ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే సందేశం. ఇది వరకు కూడా ఇలాంటివి ఉండేవి కానీ, ఇప్పుడు ప్రతి చిన్న విషయాన్ని కంటెంట్‌గా మార్చుతున్నారు. ఇది కొంచెం చికాకుగా అనిపించినా.. నేటి వాస్తవమిదే' అన్నారు. త్రిప్తి మాట్లాడుతూ.. 'ఇంట్లో కూర్చుని ఇతరులపై వ్యాఖ్యలు చేయడం చాలా సులభం. కానీ, వారి స్థానంలో ఉండి ఆలోచిస్తే దాని వెనుక పడిన కష్టం గురించి తెలుస్తుంది. అనన్య లేదా ఐశ్వర్య అయినా.. వారిద్దరూ తమ జీవితంలో చాలా కష్టపడ్డారు. ఏదైనా ఒక పని కోసం మన సమయం, శ్రమని వెచ్చించినప్పుడు దాని ఫలితం విషయంలో కొంచెం భయం ఉంటుంది. సినిమా విడుదలకు ముందు ఇంతే. ప్రేక్షకులు కూడా డబ్బులు చెల్లించి మీ పనిని చూస్తున్నారు. కాబట్టి అది వారికి నచ్చకపోతే దానిపై వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం కాకుండా దాన్ని మరేదైనా విషయంతో ముడిపెట్టినప్పుడు అది నాకు చికాకు కలిగిస్తుంది' అని అంది త్రిప్తి.



పెద్దిలో స్పోర్ట్స్‌కే ప్రాధాన్యం

హీరో రామ్‌చరణ్

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని విడుదల దగ్గర పడుతుండడడంతో సోషల్ మీడియాలో రోజుకో వార్త వైరల్ అవుతోంది. 'జగదేకవీరుడు అతిలోకసుందరి'లోని సూపర్ హిట్ సాంగ్ 'అబ్బనీ తియ్యనీ దెబ్బ'ను ఇందులో రీక్రియేట్ చేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రామ్ చరణ్ దీనిపై స్పందించారు. మీరు కొన్ని విషయాలు బిగ్‌స్క్రీన్ మీద చూసి తెలుసుకోవాలి. మేం ఆ పాటను రీక్రియేట్ చేయలేదు. కథకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. అలాంటివి అన్నీ యాడ్ చేస్తే ఇది మరీ కమర్షియల్ సినిమా అవుతుంది. అది ఐకానిక్ సాంగ్' అని చరణ్ అన్నారు. ఇక 'పెద్ది' గురించి మాట్లాడుతూ.. 'క్రీడలపై పూర్తి ఫోకస్‌తో ఉంటూ వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే వాళ్లు దీన్ని కచ్చితంగా చూడాలి. థియేటర్ నుంచి భావోద్వేగంతో బయటకు వస్తారు. వీక్ మైండ్ ఉన్నవాళ్లు కూడా చాలా స్ట్రాంగా ఆలోచించడం ప్రారంభిస్తారు. జీవితంలో అత్యంత కష్టమైన సమయాలను ఎలా ఎదుర్కోవాలో అనేదానిపై స్పష్టమైన ఆలోచన వస్తుంది. మనకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా జీవితం ముందుకు సాగిపోవాలి అని 'పెద్ది' మనకు నేర్పుతాడు. ఈ జనరేషన్ కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయమిదని రామ్ చరణ్ తెలిపారు. ఇక, తండ్రి చిరంజీవిని చూసి ఎంతో స్ఫూర్తి పొందానని రామ్ చరణ్ చెప్పారు. ఆయన లేకపోతే తన జీవితమే లేదన్నారు.

బాబాయ్ పవన్ కల్యాణ్‌ను చూసి ఎన్నో విషయాలు

Udayam :- printed.Editor ,Pblished and owendBy M.chandrasekher.plat no12journalistcolany.near B.t.r.Nagar.vartha office Back said k.g.Road.kurnool.andrapradesh.pin518001.Printed At Uttejitha printers.Kurnool.Ap cell.9000313849. RNI Aptel2015/62159.